Follow: @ANNTELUGU
ANN తెలుగు
14-03-2026
# మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 76 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఖమ్మంలో శ్రీలీల క్రేజ్

### మాంగళ్యమాల్ ప్రారంభోత్సవానికి హాజరు...

ప్రారంభోత్సవానికి హాజరై అభినందించిన మంత్రి పొంగులేటి

**ఖమ్మం, మహా :** ప్రముఖ సినీ హీరోయిన్ శ్రీలీల ఖమ్మంలో శుక్రవారం సందడి చేశారు. ఖమ్మంలో ఏర్పాటు చేసిన మాంగళ్య 30వ శాఖను శ్రీలీల జ్యోతి ప్రజ్వలనం చేసి మాల్‌ను ప్రారంభించారు. అనంతరం మాల్‌లోని వివిధ విభాగాలను సందర్శించి, అభిమానులతో సంతోషంగా మమేకమయ్యారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో అభిమానులు తరలి వచ్చి ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. అనంతరం నటి శ్రీలీల మాట్లాడుతూ.. ఖమ్మం ప్రజలు మాంగళ్య షాపింగ్ మాల్‌కు మంచి ఆదరణ అందిస్తారని నమ్మకం ఉందని, వారి ఆశీర్వాదాలతో ఈ మాల్ మరింత విజయవంతం అవుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. వస్త్ర వ్యాపారం రంగంలో దశాబ్దాల అనుభవంతో నాణ్యమైన వస్త్రాలు అందిస్తూ మూడు రాష్ట్రాల ప్రజలకు విశేష సేవలందిస్తున్న మాంగళ్య యాజమాన్యం పి ఎస్ మూర్తి, కాసం నమశివాయ బ్రదర్స్‌ను అభినందించారు. త్వరలో తమిళనాడు రాష్ట్రంలో కూడా ఒక శాఖను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

మిగతా 2లో

టాప్ న్యూస్

### అసెంబ్లీకి రెడీ
- 16 నుండి షురూ




02

### పోలీస్ శాఖలో కొలువుల జాతర
- మెగా నోటిఫికేషన్ జారీకి రంగం సిద్ధం
- 18 వేల పోస్టుల భర్తీకి ఛాన్స్

02

### మూసీ పునరుజ్జీవనానికి బీఆర్ఎస్ వ్యతిరేకం కాదు
- బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీష్ రావు



02



హీరోయిన్ రెజినా చేతుల మీదుగా

## కలర్స్ 2.0 ప్రారంభం

### శ్రీకాకుళంలో 53వ బ్రాంచీ లాంచ్ చేసిన 'కలర్స్ హెల్త్ కేర్

**శ్రీకాకుళం, మహా:** ప్రముఖ హెల్త్ కేర్ సంస్థ 'కలర్స్ తన నూతన బ్రాంచ్ కలర్స్ 2.0ను శనివారం ఘనంగా ప్రారంభించింది. శ్రీకాకుళం నగరంలోని పాలకొండ రోడ్డు, పాండురంగ వీధిలో ఏర్పాటు చేసిన 'కలర్స్ హెల్‌త్‌కేర్' నూతన బ్రాంచీని హీరోయిన్ రెజీనా కాసాండ్రా ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒత్తిడిని అధిగమించడం, అధిక ఆలోచనలను దూరం చేసుకోవడం వల్ల మంచి ఆరోగ్యం, అందం పొందవచ్చని అన్నారు. తనకు సౌత్ ఇండియా ఫుడ్ అంటే చాలా ఇష్టమని చెప్పారు. వెజిటేబుల్ కు ప్రాధాన్యత ఇస్తానన్నారు.

మిగతా 2లో



## మూసీపై తప్పుడు ప్రచారం వద్దు



### మూసీకి 20 టీఎంసీల గోదావరి జలాలు తరలిస్తాం

- నిర్వాసితులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇస్తున్నాం
- పర్యాటక కేంద్రంగా బాపూఘాట్.. దుబాయ్ కంటే హైదరాబాద్ సురక్షిత ప్రాంతం
- అభివృద్ధి అవసరం లేదనుకుంటే ఆపేస్తా
- ప్రజలకు అబద్ధాలు చెప్పడానికి కొందరు నెలకు రూ.5 కోట్లు ఖర్చు పెడుతున్నారు
- మూసీ ఇన్వైట్స్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** మూసీ ప్రక్షాళనపై తప్పుడు ప్రచారాలు వద్దని, ఎవరు సలహాలు ఇచ్చినా స్వీకరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. గోదావరి జలాలు 20 టీఎంసీలను మూసీకి తరలించే పనులు చేపట్టామని, అందులో 2.5 టీఎంసీల గోదావరి జలాలు నిరంతరం మూసీలో ప్రవహించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. హైదరాబాద్ తాజ్‌కృష్ణలో జరిగిన మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో నిర్వహించిన 'మూసీ ఇన్వైట్స్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మూసీ ప్రక్షాళనకు సంబంధించిన అనేక అంశాలను వివరించారు

**భావితరాలు క్షమించవు**

"విదేశాల్లో పలు నదులను సందర్శించి అధ్యయనం చేశాం.


మిగతా 2లో

## ఇరాన్‌లో విధ్వంసం

### 15 వేల లక్ష్యాలపై దాడులు.. ఇరాన్ అధ్యక్షుడికి తీవ్రగాయాలు

అమెరికా రక్షణ మంత్రి ప్రకటన

వారంలో అతి భీకరదాడి చేస్తామని ట్రంప్ హెచ్చరిక



**మహా:** ఇరాన్ అణ్వాయుధాల కార్యక్రమం ముగింపే తమ ప్రధాన లక్ష్యమని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ అన్నారు. ఇజ్రాయెల్‌తో కలిసి ఇప్పటివరకు 15వేల లక్ష్యాలపై దాడులు చేశామన్నారు. మిగతా అన్ని స్థావరాలను ధ్వంసం చేయాలని యోచిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో దాడులు మరింత తీవ్రంగా ఉంటాయన్నారు. సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ తీవ్రంగా గాయపడ్డారని, గుర్తుపట్టలేని విధంగా మారినట్లు భావిస్తున్నామన్నారు. అయితే, వీటికి సంబంధించి ఎటువంటి ఆధారాలు చూపించలేదు. పెంటగాన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన.. ఇరాన్ అణ్వాయుధ కార్యక్రమాన్ని అంతం చేయడంపైనే అధ్యక్షుడు ట్రంప్ దృష్టి పెట్టారని అన్నారు.

**వారంలో భీకరదాడులు : ట్రంప్**

ఇరాన్‌కు మరోసారి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. వచ్చే వారంలో ఇరాన్‌పై భీకర దాడులు చేయనున్నట్టు వెల్లడించారు. ఓ ప్రముఖ ఛానల్ ఇంటర్వ్యూలో పాల్గొన్న ట్రంప్ అవసరమైతే చమురు నౌకలను హర్మూజ్ జలసంధి గుండా అమెరికా తీసుకువెళ్తుందని తెలిపారు. మతిచెడిన నేతలకు ఇవాళ ఏం జరుగుతుందో మీరే చూస్తారని అన్నారు. ''ఇరాన్ నౌకాదళం ఇప్పటికే కనుమరుగయ్యింది. వైమానిక దళం కూడా ఇక ఉండదు. క్షిపణులు, డ్రోన్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయి. వారి నాయకులు తుడిచిపెట్టుకు పోయారు. 47 ఏళ్లుగా అమాయకులను పొట్టన పెట్టుకుంటున్నారు. అమెరికా అధ్యక్షుడిగా వారిని అంతం చేస్తున్నా'' అని సోషల్ మీడియాలో ట్రంప్ పేర్కొన్నారు. కాగా అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో 1,444 మంది ఇరాన్ పౌరులు మృతి చెందినట్లు ఇరాన్ ప్రకటించింది.

### ఖమేనీ వారసుడికి రక్షణ లేదు

**ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన సైనిక చర్య ఊహించిన దానికంటే బాగా జరుగుతోందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతాన్యాహూ అన్నారు. ఇజ్రాయెల్ గతంలో కంటే బలంగా ఉందని చెప్పారు. ఈ క్రమంలోనే ఇరాన్‌కు కొత్తగా ఎన్నికైన సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీకి జీవితానికి రక్షణ లేదన్నారు.**

### గ్యాస్ కొరతలో వాస్తవం లేదు

తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్, మహా :** అమెరికాఇరాన్‌కు యుద్ధ నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్టు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధా న కార్యదర్శి రామకృష్ణారావు, పౌరసరఫరాలశాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రతో కలిసి ఆయన హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో వారు మాట్లాడారు.

మిగతా 2లో

### కరీంనగర్ నుండి కొండగట్టుకు.. కేంద్రమంత్రి అంజన్న ఆశీర్వాద యాత్ర




**నేటి నుండి ప్రారంభం**

**కరీంనగర్, మహా :** కరీంనగర్ నుండి కొండగట్టు వరకు కేంద్ర మంత్రి బండి సంజయ్ అంజన్న ఆశీర్వాద యాత్ర ప్రారంభించనున్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంజన్న ఆశీర్వాద యాత్ర శనివారం ఉదయం ప్రారంభంకానుంది. ఈ పాదయాత్రలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఇటీవల ఎన్నికైన బీజేపీ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. కరీంనగర్ నుండి కొండగట్టుకు పాదయాత్ర ఈ యాత్రలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మేయర్, డిప్యూటీ మేయర్ సహా పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులంతా పాల్గొననున్నారు. శనివారం ఉదయం 7గంటలకు కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం వద్దకు పూజలు నిర్వహించి అనంతరం ఈ యాత్రను ప్రారంభిస్తారు. బీజేపీ తరఫున కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో తాజాగా ఎన్నికైన 108 మంది సర్పంచులు, 450మంది వార్డు సభ్యులు, 54మంది కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ఈ పాదయాత్రలో పాల్గొననున్నారు.

**బండితో కలిసి..**

బండి సంజయ్ తో కలిసి ఎన్నికల్లో గెలిచిన వారంతా పాదయాత్ర చేయనున్నారు.

మిగతా 2లో





### కేంద్రం శుభవార్త
- గ్రామ పంచాయతీలకు మరో రూ.640 కోట్లు విడుదల
- 2024–25 ఆర్థిక సంవత్సరానికి పెండింగ్ బకాయిలు పూర్తిగా క్లియర్

02



### ఆర్టీసీలో సమ్మె సైరన్
- యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చిన జేఏసీ నేతలు
- ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్నది ప్రధాన డిమాండ్
- సమ్మెకు ఎప్పుడనేది త్వరలోనే వెల్లడి
- యాజమాన్యంతో కాదు ప్రభుత్వంలోనే యుద్ధమని వెల్లడి

02



# అసెంబ్లీకి రెడీ
## 16 నుండి షురూ

**హైదరాబాద్, మహా :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు అధికారయంత్రాంగం రెడీ అవుతోంది. గవర్నర్ ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానుండగా, తొలిసారి తెలంగాణ అసెంబ్లీకి నూతన గవర్నర్ శివప్రతాప్ శుక్లా రానున్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, పెండింగ్‌లో ఉన్న అసెంబ్లీ ప్రశ్నలకు వెంటనే సమాధానాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అన్ని విభాగాల ఉన్నతాధికారులను శుక్రవారం ఆదేశించారు. వివిధ శాఖల కార్యదర్శులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, సమావేశాల ఏర్పాట్లు, సమాధానాల పురోగతిపై సమీక్షించారు. శాసనసభ, శాసనమండలి సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని వివరాలను శనివారం లోగా పంపాలని సీఎస్ స్పష్టం చేశారు. నీటిపారుదల, వైద్య ఆరోగ్య, మున్సిపల్ పరిపాలన, ఇంధన, రెవిన్యూ శాఖలకు సంబంధించి అత్యధికంగా ప్రశ్నలు ఉన్నాయని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

### మూసీ పునరుజ్జీవనానికి బీఆర్ఎస్
# వ్యతిరేకం కాదు
**బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీష్ రావు**

**హైదరాబాద్. మహా :** 'సీఎం రేవంత్‌రెడ్డి కాదు. ఆయన గోబెల్స్ రెడ్డి. అన్నీ మాట తప్పుడే. ఒక్కటీ చేయడు. నిజాలు మాట్లాడొద్దు అనే శాపం రేవంత్‌రెడ్డికి ఉన్నట్లుంది' అని మాజీమంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. మూసీ అభివృద్ధి పేరుతో హైదరాబాద్‌లో విధ్వంస ఖాండను కొనసాగిస్తున్నారని.. ప్రజల ఇండ్లు కూల్చే హక్కు ఎవరిచ్చారు రేవంత్‌రెడ్డి అని ప్రశ్నించారు. మూసీ బ్యూటిఫికేషన్ మీద సీఎం ఫైవ్ స్టార్ హోటల్‌లో ప్రజెంటేషన్ ఇస్తున్నారని.. మీరు చేస్తున్నది ఎకలాజికల్ ప్యూరిఫికేషనా? లేదా ఆస్తటిక్ బ్యూటిఫికేషనా? అని నిలదీశారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా, బాధితుల పక్షాన కొన్ని సూటి ప్రశ్నలు వేస్తున్నామని.. వాటికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మూసీ పునరుజ్జీవనానికి బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ వ్యతిరేకం కాదని.. మూసీ పేరిట రేవంత్ చేస్తున్న లూటిఫికేషన్‌కు మాత్రమే వ్యతిరేకమని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళన మీద చిత్తశుద్ధి ఉన్న వారెవరూ ముందే పేదల ఇండ్ల మీద పడరని అన్నారు.

### గ్యాస్ కొరతలో
# వాస్తవం లేదు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై వినియోగదారులు గందరగోళం చెందుతున్న నేపథ్యంలో కొరతపై తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని అధికారులకు సూచించారు. రోజువారీగా 72శాతం బుకింగ్‌లు జరుగుతున్నాయని, గృహ వినియోగదారులతో పాటు ఆస్పత్రులు, విద్యా సంస్థలు, ప్రభుత్వ సంస్థలకు ప్రాధాన్య క్రమంలో సరఫరా చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉం దన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ, యాసంగి ధాన్యం సేకరణకు గన్నీ బ్యాగులు, నిల్వలకు గోదాంలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

### కరీంనగర్ నుండి కొండగట్టుకు..
# కేంద్రమంత్రి అంజన్న ఆశీర్వాద యాత్ర

(మొదటిపేజీ తరువాయి)

వీరు మాత్రమే కాకుండా వేలాది మంది కాషాయ కర్తలు, భక్తమండళ్లు, స్వచ్ఛంద సంస్థలు, హనుమాన్ భక్తులు భారీ ఎత్తున బండి సంజయ్‌తో కలిసి కరీంనగర్ నుండి కొండగట్టు వరకు పాదయాత్ర చేసేందుకు సమాయత్తమవుతున్నారు. బీజేపీ పోలింగ్ బూత్ సభ్యుల నుండి రాష్ట్ర నాయకుల వరకు ప్రతి ఒక్కరూ ఈ యాత్రలో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అంజన్న ఆశీర్వాద యాత్రకు వచ్చే వారిని స్వాగతిస్తూ భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు నగరంలో పెద్దఎత్తున అలంకరణ చేశారు.

**అంజన్న ఆశీర్వాదం కోసం**

aశనివారం ఉదయం 6 గంటలకు మహాశక్తి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అక్కడి నుంచే పాదయాత్ర ప్రారంభం కానుంది. అనంతరం ఉదయం 7 గంటలకు అధికారికంగా "అంజన్న ఆశీర్వాద యాత్ర" ప్రారంభం అవుతుంది. కరీంనగర్ నుండి కొండగట్టు వరకు గ్రామ గ్రామాన ప్రజలను పలకరించుకుంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ పాదయాత్ర చేస్తారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం 10వ తరగతి వార్షిక పరీక్షలు కొనసాగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా క్రమశిక్షణతో పాదయాత్ర నిర్వహించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కాషాయ శ్రేణులకు సూచించారు. ఆధ్యాత్మిక భావన పెంపొందేలా పాదయాత్ర పోలీసులకు సహకరించాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా ఆధ్యాత్మిక భావన పెంపొందించేలా ఈ యాత్ర కొనసాగుతుందని, ప్రతి ఒక్కరూ పాల్గొని 'అంజన్న ఆశీర్వాద యాత్ర'ను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మూసీపై తప్పుడు ప్రచారం వద్దు

(మొదటిపేజీ తరువాయి)



ఇప్పటికీ కార్యాచరణ చేపట్టకపోతే భవిష్యత్ తరాలు క్షమించవు.మూసీ అభివృద్ధి బాధ్యతాయుతంగా చేపట్టాలని ప్రయత్నిస్తున్నాం. రెండేళ్లుగా నిపుణులు, అధికారులతో క్షుణ్ణంగా ప్రతి అంశం పరిశీలించాం. నిజాంలు, బ్రిటీషర్లు సికింద్రాబాద్ నగరాన్ని నిర్మించారు. చంద్రబాబు, వైఎస్ఆర్ హయాంలో సైబరాబాద్ నిర్మించారు. కృష్ణా, గోదావరి జలాలతో ప్రజల దాహార్తి తీర్చాలని ప్రయత్నించాం. ఈసీ, మూసీ వరదల నియంత్రణకు ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించారు. వందేళ్ల క్రితం నిర్మించిన జలాశయాలు నేటికీ ప్రజల దాహార్తి తీరుస్తున్నాయి. ప్రపంచ పరిణామాలు, పర్యావరణ మార్పులను పరిగణనలోకి తీసుకోవాలి. అపార మేధో సంపత్తి ఉందని చెప్పేవారు ప్రాజెక్టులను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏవైనా తప్పులు చేస్తే సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరించేందుకు సిద్ధం. గాంధీ స్ఫూర్తి కోసం వారి అస్తికలను దేశంలో వివిధ ప్రాంతాల్లో పెట్టారు. కన్యాకుమారి వద్ద రెండు సముద్రాలు కలిసే చోట గాంధీ అస్తికలు పెట్టారు. మూసీ, ఈసీ సంగమం లంగర్‌హౌస్ వద్ద బాపూ ఘాట్‌ను పర్యాటక కేంద్రం చేస్తాం" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

**ఎవరికీ వ్యతిరేకం కాదు**

గోదావరి జలాలు 20 టీఎంసీలను మూసీకి తరలించే పనులు చేపట్టామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మూసీలో నిరంతరం 2.5 టీఎంసీల గోదావరి జలాలు ప్రవహించేలా, మిగతా 17.5 టీఎంసీల గోదావరి జలాలతో హైదరాబాద్ ప్రజల దాహార్తి తీర్చే యత్నం చేస్తామని చెప్పారు. మూసీలో ప్రవహిస్తున్న విషం నల్గొండ ప్రజలను అతలాకుతలం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లోరైడ్ వల్ల నల్గొండ నివాస యోగ్య ప్రాంతం కాదని డబ్ల్యూహెచ్‌వో చెప్పిందని, ఫ్లోరైడ్ నీటితో పండించిన పంటలు తినేందుకు ఉపయోగించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. మానవ, పశువుల కళేబరాలు, ఫార్మా రసాయనాలు, కాలుష్యంతో మూసీ కలుషితమవుతుందని పేర్కొన్నారు. ఎంతో ఘనమైన మూసీ చరిత్ర కాలగర్భంలో కలిసిపోతోందని,రాజకీయ ప్రయోజనాల కోసం చరిత్రను కాలగర్భంలో కలిపేద్దామా? అని ప్రశ్నించారు. మేం చేపడుతున్న ప్రాజెక్టు ఎవరికీ వ్యతిరేకం కాదన్నారు. పాతబస్తీలో మెట్రో, రోడ్ల విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని, అభివృద్ధి పనుల కోసం రూ.వేల కోట్లు ఖర్చు పెడుతున్నామని చెప్పారు. ఎలాంటి ఆధారం, ఆదరణ, ప్రభుత్వ వసతులు లేక మూసీ ఒడ్డున ఉన్నారని, చివరి మజిలీగా మూసీ పరివాహక ప్రాంతంలో నివసిస్తున్నారన్నారు.

**దుబాయ్ కంటే హైదరాబాద్ సేఫ్**

స్వాతంత్ర్యం వచ్చాక మనం కట్టిన అద్భుత కట్టడం ఏమైనా ఉందా అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంచి పనులు చేపట్టినప్పుడు సహకరించకున్నా పర్వాలేదు.. అడ్డుకోకండన్నారు. "గొప్ప గొప్ప వర్సిటీల్లో చదివామని చెప్పుకుంటున్న వారు సలహాలు ఇవ్వండి. సమాజానికి మంచి పనులు చేసి... మంచికి ప్రతినిధి కావాలనుకుంటున్నా. అభివృద్ధి అవసరం లేదనుకుంటే అందరూ తీర్మానం చేయండి ఆపేస్తా. ప్రకృతి కంటే మనం గొప్పవాళ్లమా? హైదరాబాద్ కాంక్రీట్ జంగిల్‌గా మారిపోయింది. నీళ్లు భూమిలోకి వెళ్లకపోతే... నీళ్లు ఎలా వస్తాయి? మా ఇంట్లో 1500 అడుగుల బోరు వేస్తేనే నీళ్లు వచ్చాయి. మూసీలో నిరంతరాయంగా నీళ్లు ప్రవహిస్తే.. భూమిలోకి నీళ్లు వెళ్తాయి. ఏవైనా అభివృద్ధి ప్రాజెక్టు చేపట్టినప్పుడు భూములు పోతాయి. ఇళ్లు కోల్పోయిన వారికి గతంలోకంటే ఎక్కువ పరిహారం ఇస్తామని చెబుతున్నాం. మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తున్నాం. దుబాయ్ కంటే హైదరాబాద్ సురక్షితమైన ప్రాంతం. ప్రజలకు అబద్ధాలు చెప్పడానికి కొందరు నెలకు రూ.5 కోట్లు ఖర్చు పెడుతున్నారు. పేదలతో మాకు శత్రుత్వం ఏముంది.. పేదలతో శత్రుత్వం చేస్తే మళ్లీ అధికారంలోకి వస్తామా? మూసీని అభివృద్ధి చేస్తే కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని వాళ్లకు ఈర్ష్య.. చెడు చూడను.. చెడు వినను.. మంచి ఎవరు చెప్పినా స్వీకరిస్తాను" ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, ఎంపీలు, ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# ఆర్టీసీలో సమ్మె సైరన్

- యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చిన జేఏసీ నేతలు
- ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్నది ప్రధాన డిమాండ్
- సమ్మెకు ఎప్పుడనేది త్వరలోనే వెల్లడి
- యాజమాన్యంతో కాదు ప్రభుత్వంలోనే యుద్ధమని వెల్లడి



**హైదరాబాద్, మహా :** ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో యాజమాన్యానికి జేఏసీ నేతలు సమ్మె నోటీసు ఇచ్చారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వెంటనే చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని, మహాలక్ష్మి పథకం కింద ప్రతినెలా రూ.350 కోట్లు కోత లేకుండా ఇవ్వాలని వారు నోటీసుల్లో కోరారు. పాత బకాయిలు రూ.2,500 కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరుతూనే, ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కూడా వారు డిమాండ్ చేశారు. అలాగే ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని వారు యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. నోటీసులు ఇచ్చే ముందు కార్మిక సంఘాలు హైదరాబాద్‌లోని బస్‌భవన్ వద్ద నిరసనకు దిగారు. ఈవీ బస్సులపై ఆర్టీసీ ఉద్యోగులే పనిచేయాలని, వారికి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు ఇవ్వాలని ధర్నా చేపట్టారు. ఆర్టీసీని ఎందుకు ప్రభుత్వంలో ఎందుకు విలీనం చేయడం లేదని, అన్యాయంగా యూనియన్లను సర్కారు రోడ్డెక్కించిందని ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి వెళ్లే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని నేతలు తేల్చిచెప్పారు. గవర్నర్ వద్ద ఉన్న ఆర్టీసీ విలీన బిల్లుకు ఆమోదముద్ర ఎందుకు వేయించడం లేదని ప్రశ్నించారు. కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**యాజమాన్యంతో కాదు.... ప్రభుత్వంతోనే యుద్ధం**

రెండున్నర ఏళ్లు ఎదురు చూశామని ఇక తమకు ఓపిక నశించిపోయిందని కార్మిక సంఘాల జేఏసీ వ్యాఖ్యానించింది. ఆర్టీసీ కార్మికుల కుటుంబాలకు భరోసా లేదని, బరోసా లేని తాము ఎలా బతకాలని వాపోయారు. తమకు బడ్జెట్‌లో ప్రత్యేకంగా వాటా కావాలన్నారు. బ్రెడ్ విన్నర్ స్కీమ్‌ను ఎందుకు మార్చరని ప్రశ్నించిన ఆర్టీసీ జేఏసీ నేతలు, యాజమాన్యానికి తనకు ఎలాంటి యుద్ధం లేదని చెప్పారు. కేవలం ప్రభుత్వంతోనే యుద్ధమన్నారు. తాము ఎన్ని పోరాటాలు చేసినా, ఎన్ని సభలు పెట్టినా ఈ ప్రభుత్వం చర్చలకు కూడా పిలువలేదని, అసలు రాష్ట్రంలో ప్రజాపాలన ఉందా? అని ఆర్టీసీ జేఏసీ ప్రశ్నించింది. గత ప్రభుత్వం చేయాల్సిన క్రతువు చేసిందని ఈ ప్రభుత్వం మిగిలింది ఎందుకు చేయలేదని ప్రశ్నలు సంధించారు.

**మెట్రోను స్వాధీనం చేసుకున్న ప్రభుత్వం ఆర్టీసీపై ఎందుకు వివక్ష**

కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోపై ఇప్పుడు ఏం చెబుతారని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక సమాజానికి వ్యతిరేకంగా పనిచేస్తోందని మండిపడ్డారు. ఆర్టీసీ హక్కులను కాపాడుతామని, ఆర్టీసీతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం ముందుకు పోలేదని హెచ్చరించారు. మెట్రోను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని, మరి ఆర్టీసీని ఎందుకు ప్రభుత్వంలో విలీనం చేసుకోవడం లేదని జేఏసీ నేతలు ప్రశ్నించారు. తమ డిమాండ్ల సాధన కోసం అవసరమైతే అసెంబ్లీ ముందు ఆందోళనకు సైతం వెనుకాడబోమని స్పష్టం చేశారు. జైలుకు వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు వారు తెలిపారు.

# పోలీస్ శాఖలో కొలువుల జాతర

**మెగా నోటిఫికేషన్ జారీకి రంగం సిద్ధం.. 18 వేల పోస్టుల భర్తీకి ఛాన్స్**

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోలీస్ పోస్టుల భర్తీకి రంగం సిద్ధమైంది. యూనిఫామ్ వేసుకోవాలనే లక్ష్యంతో ఉన్న వేలాది మంది యువతీ యువకులకు ఈ ఏడాది 'మెగా నోటిఫికేషన్' లభించే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్ర పోలీస్ విభాగంలో ఏటా పెరుగుతున్న ఖాళీలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి భారీ ఎత్తున నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2026 ఫిబ్రవరి చివరి నాటికి అందుబాటులో ఉన్న ఖాళీలపై ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందింది. పోలీసు శాఖ అందించిన గణాంకాల ప్రకారం రాష్ట్రంలో మొత్తం 95,361 పోలీసు పోస్టులు మంజూరవ్వగా, ప్రస్తుతం కేవలం 77,369 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. అంటే దాదాపు 17,992 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. శాంతి భద్రతల పరిరక్షణలో ఇబ్బందులు కలగకుండా ఉండాలంటే ఈ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని పోలీస్ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ప్రభుత్వ ఆమోదం లభించిన వెంటనే నియామక ప్రక్రియ ప్రారంభం కానుంది. పోలీస్ ఎంపిక ప్రక్రియ సుదీర్ఘంగా సాగుతుంది కాబట్టి, ముందస్తుగానే అనుమతులు కోరుతూ ప్రతిపాదనలు పంపారు.

**ఎస్సై పోస్టు ఇక రాష్ట్ర స్థాయి**

పోలీసు పదోన్నతులకు సంబంధించి దశాబ్దాలుగా నెలకొన్న వివాదాలకు చెక్ పెట్టేందుకు అధికారులు




కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు జోన్లవారీగా ఉన్న ఎస్సై పోస్టులను ఇకపై 'రాష్ట్ర స్థాయి' పోస్టులుగా మార్చబోతున్నారు. ఈ మేరకు సర్వీస్ రూల్స్‌లో మార్పులు చేస్తూ పంపిన ప్రతిపాదనలపై ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. అక్కడ ఆమోదం పొందితే, ఎస్సైల ట్రాన్స్ ఫర్, ప్రమోషన్స్ రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడైనా జరిగే అవకాశం ఉంటుంది. దీనివల్ల పదోన్నతుల ప్రక్రియ మరింత వేగవంతం కానుంది.

**ఖాతా తెరవనున్న నోటిఫికేషన్లు**

కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత భారీ ఎత్తున నియామకాలు జరగనున్న నేపథ్యంలో, అభ్యర్థులు ఇప్పటి నుంచే తమ ప్రిపరేషన్‌ను వేగవంతం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. సివిల్, ఏఆర్ విభాగాలతో పాటు ఇతర స్పెషల్ బెటాలియన్లలో కూడా పోస్టులు ఉండటంతో యూనిఫామ్ వేసుకోవాలని కల కంటున్న వేలాది మంది యువతకు ఇది ఒక సువర్ణావకాశం అని చెప్పవచ్చు_

**సుదీర్ఘ ప్రక్రియ.. ముందే సన్నద్ధం కావాలి**

పోలీసు ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ సాధారణ ఉద్యోగాల కంటే భిన్నంగా, క్లిష్టంగా కూడా ఉంటుంది. దేహదారుఢ్య పరీక్షలు మరియు రాత పరీక్షల నిర్వహణకు ఎక్కువ సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో, నోటిఫికేషన్ వచ్చిన వెంటనే అభ్యర్థులు సిద్ధంగా ఉండేలా పోలీస్ శాఖ ముందస్తు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపింది. ఒకసారి అనుమతి లభిస్తే, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు షెడ్యూల్‌ను విడుదల చేయనుంది. శాఖలో పెరుగుతున్న పని ఒత్తిడిని తగ్గించడానికి, శాంతిభద్రతల పరిరక్షణను మరింత పటిష్టం చేయడానికి ఈ ఖాళీల భర్తీ అత్యవసరమని అధికారులు భావిస్తున్నారు. ఖాళీగా ఉన్న ఈ 18 వేల ఉద్యోగాల భర్తీకి సంబంధించి ప్రభుత్వం నుంచి తుది నిర్ణయం వెలువడితే, నిరుద్యోగులకు ఇది అతిపెద్ద శుభవార్త కానుంది.

# ఖమ్మంలో శ్రీలీల క్రేజ్

### మాంగళ్యమాల్ ప్రారంభోత్సవానికి హాజరు...

### ప్రారంభోత్సవానికి హాజరై అభినందించిన మంత్రి పొంగులేటి




(మొదటిపేజీ తరువాయి)

మాంగళ్య షాపింగ్ మాల్ డైరెక్టర్లు పుల్లూరు నరసింహ మూర్తి, కాసం నమశివాయ, కాసం మల్లికార్జున, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి వర్గానికి, ప్రతి సందర్భానికి అనువైన నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరల్లో అందించడమే తమ విజయ రహస్యం అని పేర్కొన్నారు.తమ స్వంత హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఆధునిక మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా డిజైన్ చేసి, వస్త్ర వ్యాపారంలో ముందంజలో కొనసాగుతున్నామని తెలిపారు .మాంగళ్య షాపింగ్ మాల్‌లో మహిళలు, పురుషులు, యువత, పిల్లల కోసం తాజా ఫ్యాషన్ కలెక్షన్స్, అలాగే వివాహాలు, శుభకార్యాలకు ప్రత్యేకమైన భారీ వెడ్డింగ్ కలెక్షన్స్ అందుబాటులో ఉన్నాయని . ఈ మాల్ ప్రారంభంతో ఖమ్మం జిల్లా ప్రజలు ఇకపై పెళ్లి షాపింగ్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, తమ ప్రాంతంలోనే నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు కొనుగోలు చేయవచ్చని పేర్కొన్నారు. మాంగళ్య ఒక సంపూర్ణ ఫ్యామిలీ షాపింగ్ మాల్ గా ప్రత్యేక గుర్తింపు పొందిందని ప్రస్తుతం మూడు రాష్ట్రాల్లో విజయవంతంగా కొనసాగుతున్న మాంగళ్య షాపింగ్ మాల్, రాబోయే రోజుల్లో ఈ మూడు రాష్ట్రాల్లోనే 9-10 కొత్త ప్రాజెక్టులు ప్రారంభించనుండగా, భవిష్యత్తులో తమిళనాడు రాష్ట్రానికి కూడా విస్తరించనున్నట్లు డైరెక్టర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్లు విశాల్, వరుణ్, కార్తిక్, అరుణ్, పనీత్, సాయి కృష్ణ పాల్గొన్నారు.

# కేంద్రం శుభవార్త

**గ్రామ పంచాయతీలకు మరో రూ.640 కోట్లు విడుదల**

**2024–25 ఆర్థిక సంవత్సరానికి పెండింగ్ బకాయిలు పూర్తిగా క్లియర్**

**హైదరాబాద్, మహా :** గ్రామపంచాయతీలకు కేంద్రం శుభవార్త చెప్పింది. 202425 ఆర్థిక సంవత్సరానికి పెండింగ్ బకాయిలు పూర్తిగా క్లియర్ చేసింది. ఇంతకుముందు ఇంతకుముందు రూ.640 కోట్లు... తాజాగా మరో రూ.640 కోట్లు విడుదల చేసిందని మంత్రి సీతక్క తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులలో భాగంగా కేంద్రం విడుదల చేసిందని, 2025-26కు ఇంకా రూ.1,255 కోట్లు రావాల్సి ఉందన్నారు. పెండింగ్ నిధులను త్వరగా విడుదల చేయాలని, యుటిలిటీ సర్టిఫికెట్లు సమర్పణతో నిధుల విడుదల వేగం పెరిగిందన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు కీలకమని, 15వ ఆర్థిక సంఘం గడువు ముగిసేలోపు నిధులు ఇవ్వాలన్నారు. గ్రామీణాభివృద్ధి వేగవంతమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు.

### హీరోయిన్ రెజీనా చేతుల మీదుగా
# కలర్స్ 2.0 ప్రారంభం
### శ్రీకాకుళంలో 53వ బ్రాంచీ లాంచ్ చేసిన కలర్స్ హెల్త్ కేర్



(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా .మేనేజింగ్ డైరెక్టర్ డా. విజయ్ కృష్ణ మాట్లాడుతూ, "శ్రీకాకుళం బ్రాంచ్‌ను ఆవిష్కరించిన రెజినా కు కృతజ్ఞతలు. 22 ఏళ్ల అనుభవం మాకు మరింత నమ్మకం ఇచ్చింది. నగర ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ బ్రాంచ్‌ను ఏర్పాటు చేశాం. యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదం పొందిన టెక్నాలజీతో అధిక బరువు, హెయిర్, స్కిన్ సమస్యలకు అంతర్జాతీయ ప్రమాణాల చికిత్సలను అందిస్తున్నాం ఆరోగ్యంగా, అందంగా ఉండాలన్న ప్రతి ఒక్కరి ఆశకు కలర్స్ హెల్త్ కేర్ ఎల్లప్పుడూ తోడ్పడుతుంది" అని అన్నారు. కలర్స్ హెల్త్‌కేర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట శివాజీ కూన మాట్లాడుతూ పుట్టిన ఊరు శ్రీకాకుళంలో సెంటర్ ప్రారంభించడం ఎంతో సంతోషమన్నారు. తమకు చెన్నైలో ఉన్న స్టోర్ కి ఇక్కడ ఏర్పాటుచేసిన స్టోర్ కి తేడా లేకుండా ఆధునాతనమైన సేవలు అందిస్తామన్నారు. కలర్స్ ఆపరేషన్ విభాగ డైరెక్టర్ కృష్ణంరాజు మాట్లాడుతూ ఉత్తమ వెల్నెస్ క్లినిక్ గా కలర్స్ ను తీర్చిదిద్దుతామని చెప్పారు. 51 మంది డెర్మటాలజిస్టులు ఉన్న ఏకైక వెల్నెస్ సెంటర్ తమదే అని చెప్పారు. 5ఎం మీడియా ఆధ్వర్యంలో జైదీప్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో అభిమానులు, అతిథులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కొత్త బ్రాంచ్ ప్రారంభోత్సవానికి పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

# అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం
### కామాఖ్యచర్లపల్లి మధ్య రైలు ప్రారంభించిన మోదీ




**మహా:** అసోం, రెండు తెలుగు రాష్ట్రాలను అనుసంధానించే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ రైలును ప్రధాని అసోంలో ప్రారంభించారు. అసోంలోని ప్రముఖ పుణ్య క్షేత్రం కామాఖ్య, చర్లపల్లి మధ్య స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లతో ఈ రైలు సేవలు అందించనుంది. దీనితో ఈశాన్య ప్రాంతాల వైపు వెళ్లే ప్రయాణికులకు తక్కువ ఛార్జీలతో సౌకర్యవంతమైన ప్రయాణం సాధ్యమవుతుంది. ఈ రైలు మార్గమధ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని శ్రీకాకుళం రోడ్డు, విజయనగరం జంక్షన్, పెందుర్తి, దువ్వాడ, సామర్లకోట జంక్షన్, రాజమహేంద్రవరం, తణుకు, భీమవరం పట్టణం, గుడివాడ, విజయవాడ, గుంటూరు, నల్గొండ స్టేషన్లలో ఆగుతూ, అక్కడి నుంచి చర్లపల్లికి చేరుకుంటుంది.

# నిజాపూర్ (కె) పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు

- పాల్గొన్న సర్పంచ్ తులసి సత్యనారాయణ
- పాఠశాల అభివృద్ధిని అభినంధించిన సర్పంచ్
- ఉపాధ్యాయులకు సన్మానం
- విద్యార్థులకు అభినందనలు




**మహా, సంగారెడ్డి ప్రతినిధి:** సదాశివపేట మండలం లోని నిజాంపూర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా నటించి తోటి విద్యార్థులకు పాఠాలు భోదించారు.అనంతరం ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో నిజాంపూర్ గ్రామ సర్పంచ్ జోరీగల తులసి సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ తులసిసత్యనారాయణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఆదర్శమైన మరియు గౌరవప్రదమైన వృత్తి అని అన్నారు.విద్యార్థులు క్రమశిక్షణ,విలువలతో కూడిన విద్యను అభ్యసించి,తల్లి దండ్రులకు,గ్రామానికి మంచిపేరు తేవాలని కోరారు. పాఠశాల అభివృద్ధిలో మా వంతు సహాయ సహకారాలు తప్పక నిర్వహిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఉప సర్పంచ్ సిద్ది రాములు మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం పాఠశాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నారని దీనికి పాఠశాల సాధించిన అవార్డులే నిదర్శనం అని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయునులు నవనీత,సునీత మరియు సిఆర్పి నాగరత్నంలను ఘనంగా సన్మానించారు.జిల్లా స్థాయి వెస్ట్ టు వెల్త్ లో పాల్గొని బహుమతి పొందిన విద్యార్థులను అభినందించారు.ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలను ఆవిష్కరించాలని అందుకుగాను చిన్నతనం నుండే ఆ దిశగా ఆలోచించాలని త ద్వారా దేశానికీ మంచి పేరు తేవాలని విద్యార్థులను కోరారు.ఈ సందర్భంగా విద్యార్థులు వారి యొక్క ఒక్కరోజు అనుభవాలను తోటి విద్యార్థులతో పంచుకున్నారు. అంతకు ముందు పాఠశాలకు ముఖ్య అతిధిగా వచ్చిన నూతన సర్పంచ్ తులసి సత్యనారాయణ దంపతులను, ఉప సర్పంచ్ బుచ్చి రాములను, గ్రామ కార్యదర్శి ప్రదీప్ కుమార్ ను పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు ఘనంగా సన్మానించారు.అనంతరం సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఒక్కరోజు డీఈఓగా మనుష,యంఈఓగా సాత్విక,ప్రధానోపాధ్యాయులుగా అమాన్ మోసిన్, ఉపాధ్యాయులుగా శ్రీకాంత్, లాస్య,శ్వేత,అల్తాప్,సాత్విక వ్యవహారించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ తులసిసత్యనారాయణ,ఉపసర్పంచ్ బుచ్చి రాములు, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ,ఉపాధ్యాయలు నవనీత,సునీత,సిఆర్పి నాగరత్నం, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ కుమార్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## కొత్త గొల్ల సోమశేఖర్ ఆధ్వర్యంలో మైనార్టీ సోదరులకు ఇఫ్తార్ విందు




**మహా :సంగారెడ్డి ప్రతినిధి:** సదాశివపేట 8వ వార్డు కౌన్సిలర్ కొత్తగొల్ల సోమశేఖర్ అధ్వర్యంలో మైనారిటీ సోదరులకు రంజాన్ సందర్భంగా ఇఫ్థాట్ విందు నిర్వహించచదం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింత సాయినాథ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింత గోపాల్ రావడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య నాయకులు మాట్లాడుతూ రంజాన్ మాసం ముస్లింలకు పవిత్రమైన మాసమని, రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేపడుతూ, అల్లాకు ప్రార్థనలు నిర్వహిస్తూ, అల్లా ఆశీర్వాదములు పొందుతారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఫరీద్, మహిమద్దీన్, బద్దాద్, జమీర్, బందేలీ, నిజాం, అల్తాఫ్, మోహి, అజ్జు,యదు,ముస్తఫా, మొహమ్మద్,ఫయాజ్,అల్తాఫ్, అక్బర్ హుస్సేన్, కౌన్సిలర్ నసీరుద్దీన్,రత్నాకర్ రెడ్డి, కొల్కూర్ ప్రవీణ్, రామ్ రెడ్డి, అంజన్న, కాలనీ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి మూడు రోజులు శిక్ష

**మహా :సంగారెడ్డి ప్రతినిధి:** మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తి కి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు సదాశివపేట సిఐ వెంకటేష్ శుక్రవారం తెలిపారు. సదాశివాపేట లో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా గురువారం రాత్రి సదాశివపేట పట్టణానికి చెందిన వడిత్య సుభాష్ మద్యం సేవించి పట్టుబడినట్లు తెలిపారు. అతనిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పర్చగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్ధికి నిందితుడికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

# ఎడవల్లి కత్వను కమ్మేసిన ఇసుకాసురులు..!

- ఇసుక అక్రమ తవ్వకాలు నేతల కాసుల వేట ఆగని 'ఇసుక' దందా..
- అనుమతులు లేవు అడ్డూ అదుపూ లేదు..
- ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న అధికార పార్టీ నేతలు..
- కత్వ నుంచి యథేచ్ఛగా వందల ట్రాక్టర్ల ఇసుక తరలింపు..
- అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే దందా నిమ్మకు నీరెత్తినట్లు ప్రభుత్వ యంత్రాంగం..



**నల్గొండ, మహా :** కనగల్ మండలంలోని ఎడవల్లి గ్రామం ఇప్పుడు ఇసుక అక్రమార్కులకు కాసుల కురిపించే గనిలా మారింది. ప్రభుత్వ అనుమతులు లేవు.. అసలు అక్కడ ఇసుక రీచ్ అన్న మాటే లేదు. కానీ అధికార పార్టీ ముసుగులో కొందరు నేతలు ప్రభుత్వ సంపదను పక్కదారి పట్టిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఎడవల్లి ప్రాజెక్టు కింద ఉన్న కత్వ (వాగు) ప్రాంతంలో ఇసుకాసురులు పంజా విసురుతున్నారు. పగలు రేయి తేడా లేకుండా యంత్రాలతో భూగర్భాన్ని తవ్వి పోస్తూ సహజ వనరులను కొల్లగొడుతున్నారు.ఈ అక్రమ దందా వెనుక అధికార పార్టీకి చెందిన కీలక నేతలు, కొందరు సర్పంచ్‌ల హస్తం ఉన్నట్లు స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జెసిబిలను రంగంలోకి దించి వందల ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా తవ్వి పక్కదారి పట్టిస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన ఆదాయాన్ని తమ ఖాతాల్లోకి మళ్లించుకుంటూ ప్రభుత్వానికే గండి కొడుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల్లో ఇసుక కొరతను సాకుగా చూపి ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ. 3,000 నుంచి రూ. 4,000 వరకు విక్రయిస్తూ సామాన్యులను నిలువునా దోచుకుంటున్నారు.గ్రామాల్లో ఇంత బహిరంగంగా ఇసుక రవాణా జరుగుతున్నా, వందల ట్రాక్టర్లు రహదారులపై తిరుగుతున్నా అటు రెవెన్యూ శాఖ గానీ, ఇటు పోలీసులు గానీ పట్టించుకోకపోవడం వెనుక పెద్ద ఎత్తున రాజకీయ ఒత్తిళ్లు ఉన్నట్లు సమాచారం. అధికార పార్టీ నాయకుల అండ ఉండటంతో అక్రమార్కులకు అడ్డు అదుపూ లేకుండా పోయిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి ఈ ఇసుక మాఫియాపై కఠిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో భూగర్భ జలాలు అడుగంటిపోయి రైతులకు తీరని నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## కంబాలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

**మహా, సంగారెడ్డి ప్రతినిధి:** సదాశివపేట మండలం కంబాలపల్లి లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెప్పిన ఇందిరమ్మ ఇళ్లకు గాను గ్రామ సర్పంచ్ ఇంధూరి బారతమ్మ బాబు ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేయటం జరిగింది ముఖ్య అధితులు CDC చెర్మెన్ గడీల రాంరెడ్డి, రెజింతల్ గ్రామ సర్పంచ్ ఆశిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు భీంసేనారెడ్డి, ఉపసర్పంచ్ కుమ్మరి పార్వతమ్మ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, గరు, సభ్యుడు ప్రభు,సభ్యుడు ప్రభాకర్ రెడ్డి,సభ్యుడు మునీర్. కృష్ణ .నర్సిములు,సురేష్, దుర్గా మేస్త్రీ,శివ తధితరులు పల్గొనడం జరిగింది.

# పేద ప్రజలకు సేవ చేస్తేనే పుణ్యం

- ప్రతి ఒక్కరిలో సేవా గుణం ఉండాలి
- జమాతే ఇస్లామి హింద్ షేక్ అబ్దుల్ బాసిత్

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఇస్లాం ఒక సార్వజనీమైన జీవిత విధానమని సాటి మానవుల పట్ల బాధ్యతగా వారి హక్కులను చెల్లించడమే నిజమైన దైవ భీతి,దైవ భక్తి అని ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపారని జమాతే ఇస్లామి హింద్ సభ్యులు అబ్దుల్ బాసిత్ పేర్కొన్నారు.శుక్రవారం పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మేదర్ బస్తీ, గణేష్ టెంపుల్ లోని "మస్జిద్ ఏ వహీద్" లో ఏర్పాటు అయిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రంజాన్ ఉపవాసాల ద్వారా మనిషిని మనిషిగా మంచి మానవతా విలువలు కలిగిన మహనీయులుగా మారే శిక్షణ పొందిన తర్వాత మిగతా పదకొండు నెలలు కూడా ఆచరణాత్మకంగా జీవించాలని తద్వారా మనం చుట్టూ ఉన్న సమాజంలో ప్రేమ ఆప్యాయతలు పంచుతూ దైవభీతి ఆధార సత్ సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని కోరారు. ఇస్లాం ఆధ్యాత్మిక ఆరాధనతో పాటు ఆర్థిక ఆరాధన ద్వారా సాటి మానవుల అవసరాల తీర్చాలని కోరుతుందన్నారు. అందుకే స్వచ్ఛందంగా జకాత్, సదఖా దానధర్మాలు ఇతోధికంగా చేసేలా రంజాన్ మాసం ప్రేరేపిస్తుందని అన్నారు. ఆకలి అంటే ఏమిటో ఆచరణాత్మకం తెలుసుకుని సాటి వారిని ఆదుకునే గుణం అలవర్చుకోవాలని అన్నారు.రంజాన్ మాసంలో అవతరించిన ఖురాన్ బోధనలను సర్వ వ్యాప్తి చేసి మానవాళి మధ్య సత్సంబంధాలు నెలకొల్పాలని కోరారు. ద్వేషించే వారిని ప్రేమించాలని, మంచి చెడు ఒకటికాదు. చెడును అతి శ్రేష్టమైన మంచి ద్వారా తొలిగిస్తే మీ ప్రాణ శత్రువు సైతం ప్రాణ మిత్రుడు అయిపోవడాని గమనిస్తావు అన్న ఖురాన్ బోధలను తు.చ తప్పకుండా పాటించాలని అన్నారు.రంజాన్ ఉపవాసాల ద్వారా సమాజంలో మంచిని పంచుతూ, ప్రేమానురాగాలతో ఒకరినొకరు కలిసి మెలిసి ఉండాలే ఆ పై వాడు జీవించాలని ఆకాంక్షించారు.

# సాగు తాగునీటిపై కలెక్టర్ ప్రత్యేక నజర్..

- జూన్ చివరి వరకు నిల్వలు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి..
- పంటలు ఎండిపోకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలి..
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్, తుమ్మల ఆదేశం..



**నల్లగొండ, మహా :** రాబోయే వేసవి కాలం దృష్ట్యా జిల్లాలో సాగు, తాగునీటి కొరత తలెత్తకుండా యంత్రాంగం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మిర్యాలగూడ నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించిన ఆయన సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి రిజర్వాయర్ల ప్రస్తుత పరిస్థితిపై ఇంజనీరింగ్ అధికారుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలంలో తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని జూన్ చివరి వరకు ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఆయా రిజర్వాయర్లలో నీటిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. ముఖ్యంగా ఉదయ సముద్రం ద్వారా నల్లగొండ పట్టణం, పరిసర గ్రామాలకు తాగునీటి సరఫరా నిరంతరాయంగా సాగేలా అవసరమైన నిల్వలు ఉంచాలన్నారు. సాగర్ టేలెండ్ పరిధిలో తాగునీటి పరిస్థితిపై క్షేత్రస్థాయి పర్యటన చేసి నివేదిక ఇవ్వాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్‌ను ఆదేశించారు. అదే సమయంలో ఉదయ సముద్రం కింద సాగవుతున్న పంటల పరిస్థితిని పరిశీలించి కోత దశ వరకు ఎంత నీరు అవసరమో రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఎక్కడా సాగునీరు లేదా విద్యుత్ కొరత కారణంగా పంటలు ఎండిపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తేల్చి చెప్పారు. ఈ నెలాఖరు వరకు అత్యంత అప్రమత్తంగా ఉండి ప్రతి రెండు మూడు రోజులకోసారి ప్రాజెక్టుల కింద ఇంజనీర్లు, వ్యవసాయ, విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎల్పీజీ గ్యాస్ సరఫరాపై సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దని గృహ వినియోగదారులకు సరిపడా గ్యాస్ అందుబాటులో ఉందని భరోసా ఇచ్చారు. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే 288 కేసులు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. జిల్లా స్థాయిల్లో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి గ్యాస్ సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. మరోవైపు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యాలను సాధించేలా ప్రతి 15 రోజులకోసారి సమీక్షించాలని కోరారు. ప్రాజెక్టుల కింద భూసేకరణ సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించాలని, గుర్తించిన భూములకు సరిహద్దులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ తో పాటు ఇరిగేషన్, వ్యవసాయ, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పది పరీక్షలకు పోలీసుల 'పటిష్ట' బందోబస్తు..

- నేటి నుంచి జిల్లావ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలు..
- కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలు..
- జిరాక్స్ సెంటర్లు మూసివేయాలి ఎస్పీ శరత్ చంద్ర పవార్..



**నల్లగొండ, మహా :** జిల్లాలో శనివారం నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి వార్షిక పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసింది. ఏప్రిల్ 16వ తేదీ వరకు కొనసాగే ఈ పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించడమే తమ ప్రాధాన్యతని ఆయన పేర్కొన్నారు.పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ప్రజలు గుమిగూడకుండా ఉండేందుకు 500 మీటర్ల పరిధిలో సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ (పాత 144 సెక్షన్) అమలులో ఉంటుందని ఎస్పీ స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి గుంపులుగా చేరితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షలు జరిగే సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ షాపులు, ఫోటోకాపీ దుకాణాలను తప్పనిసరిగా మూసివేయాలని ఆదేశించారు. ప్రశ్నాపత్రాల లీకేజీ, కాపీయింగ్ వంటి అక్రమాలకు తావులేకుండా ప్రత్యేక నిఘా విభాగాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద లౌడ్ స్పీకర్ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్‌లో సూచించిన సమయం కంటే ముందే కేంద్రాలకు చేరుకోవాలని ఎస్పీ సూచించారు. ప్రధాన ద్వారం వద్ద తనిఖీలు నిర్వహించే పోలీస్ సిబ్బందికి అభ్యర్థులు సహకరించాలని కోరారు. పరీక్షా హాల్లోకి సెల్ ఫోన్లు, ట్యాబ్‌లు, బ్లూటూత్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు, కాలిక్యులేటర్లు, వాలెట్లు వంటి వస్తువులను అనుమతించబోమని తేల్చి చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద స్థిర బందోబస్తుతో పాటు మొబైల్ పెట్రోలింగ్ వాహనాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే తక్షణమే విచారణ చేపడతామని తెలిపారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ వివరించారు. ముఖ్యంగా రద్దీ ప్రాంతాల్లోని కేంద్రాల వద్ద ట్రాఫిక్ పోలీసులు అందుబాటులో ఉండి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తారని చెప్పారు. పరీక్షల నిర్వహణలో ఏవైనా అక్రమాలు లేదా అనుమానాస్పద చర్యలు గమనిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## గురుకుల పాఠశాల, హాస్టళ్లలో అధికారుల ఆకస్మిక తనిఖీలు..

### విద్యార్థులతో సహా పంపి భోజనం చేసిన తాసిల్దార్..

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలోని విద్యాసంస్థలు, ప్రభుత్వ హాస్టళ్లలో శుక్రవారం అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులకు అందుతున్న వసతులు, ఆహారం, పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. మణుగూరు రాజీవ్ గాంధీ నగర్‌లో ఉన్న మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల బాలుర పాఠశాలను తహాశీల్దార్ అద్దంకి నరేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల వసతులు, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి తహాశీల్దార్ సహపంక్తి భోజనం చేసి ఆహారం నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిటి రామారావు, ఆర్ఐ గోపి తదితరులు పాల్గొన్నారు.అలాగే మణుగూరులోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఇన్‌చార్జి ఎంపీడీవో, మండల ఎం పి ఓ పల్నాటి వెంకటేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ వంటగదిని పరిశీలించి, విద్యార్థులకు వడ్డించే ఆహారాన్ని రుచి చూశారు. విద్యార్థులు నిద్రించే గదులు, హాస్టల్ పరిసర ప్రాంతాలను పరిశీలించి వసతులను పరిశీలించారు. హాస్టల్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం అందేలా చూడాలని, హాస్టల్ పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని వార్డెన్‌కు సూచనలు చేశారు.ఇదే సమయంలో మణుగూరు ఎస్సీ బాయ్స్ హాస్టల్‌లో కూడా ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. హాస్టల్ పరిసరాలు, విద్యార్థులకు అందిస్తున్న భోజనం తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థుల సంక్షేమం కోసం ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

# వృద్ధ దంపతులకు నిత్యావసర సరుకుల పంపిణీ..

### రేణుక అక్షర మహిళా మండలి ఆధ్వర్యంలో సహాయం..



**మణుగూరు, మహా :** మణుగూరు ఏరియా సింగరేణి కాలరీస్ సంస్థలో పనిచేసే ఓ కార్మికుడు తన తల్లిదండ్రులను ఇంటి నుండి బయటకు పంపించడంతో వారు ప్రస్తుతం అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నామని వృద్ధ దంపతులు రేణుక అక్షర మహిళా మండలి సభ్యులను ఆశ్రయించి ఆవేదన వ్యక్తం చేశారు. తమ యోగక్షేమాలను పట్టించుకోవడం లేదని, కోడలు కూడా మాటలతో ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవనం సాగించడం కష్టంగా మారిందని వారు వాపోయారు. వృద్ధ దంపతుల దయనీయ పరిస్థితిని తెలుసుకున్న రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు స్పందించి, వారి ఆధ్వర్యంలో శుక్రవారం మణుగూరులో నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా మండలి సభ్యులు మాట్లాడుతూ, వృద్ధులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత. కుటుంబ సభ్యులు పట్టించుకోకపోయినా సమాజం వారిని ఆదుకోవాలి. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న వృద్ధులకు సహాయం చేయడం మన సామాజిక బాధ్యతని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలి సభ్యులు ఎండి షబానా, కన్నాపురం వసంత, రెడ్డిబోయిన రేణుక, సౌజన్య డాకూరి, లక్కింశెట్టి హేమలత తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా మైనార్టీ శాఖలో కాంట్రాక్టు ఉద్యోగి పెత్తనం..

**అధికారుల కొరత తో కార్యాలయం పై పట్టు సాధించిన కాంట్రాక్టు ఉద్యోగి..నిధులు, స్కాలర్‌షిప్‌లు, లోన్ల మంజూరులో 'కమిషన్ల' దందా ఆరోపణలు..**






**నల్గొండ,మహా :** పేరుకు మాత్రమే జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ,అక్కడ సంక్షేమానికి సంబంధించిన పనులు కన్నా కాంట్రాక్టు ఉద్యోగి పెత్తనమే ఎక్కువగా నడుస్తోందన్న తీవ్ర ఆరోపణలు వెల్లువేత్తుతున్నాయి. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ, మైనార్టీ, క్రిస్టియన్ కార్పొరేషన్ జిల్లా కార్యాలయాలు గత కొన్నేళ్లుగా సిబ్బంది కొరతతో కునారిల్లుతుంటే ఈ అవకాశాన్ని ఆసరాగా చేసుకుని ఒక కాంట్రాక్టు ఫ్యాకల్టీ ఆ శాఖపై పూర్తి పట్టు సాధించారు. గత 11 సంవత్సరాలుగా ఉర్దూ అకాడమీలో కాంట్రాక్టు ఫ్యాకల్టీగా పనిచేస్తున్న ఇతను తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి కీలకమైన ఈ శాఖకు వచ్చి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఉద్యోగులు, లబ్ధిదారులు వాపోతున్నారు. మైనార్టీ సంక్షేమ శాఖకు సాధారణ బదిలీల్లో కానీ, డిప్యుటేషన్‌పై కానీ రెగ్యులర్ ఉద్యోగులు ఎవరైనా వస్తే వారు నెల రోజులు కూడా ఇక్కడ పనిచేయకుండా అడ్డుకుంటున్నట్టు ఆ ఉద్యోగి పై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.తన పెత్తనానికి అడ్డు వస్తారేమోననే నెపం తో కొత్తగా వచ్చిన ఉద్యోగులు సెలవుపై వెళ్లేలా లేదా మరోచోటుకు డిప్యుటేషన్‌పై బదిలీ అయ్యేలా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. దీనివల్ల శాఖలో రెగ్యులర్ ఉద్యోగుల కొరత తీవ్రమై అన్ని వ్యవహారాలు కాంట్రాక్టు ఉద్యోగి ఆధీనంలోకి వెళ్లినట్లు సమాచారం..

**సంక్షేమంలో 'సొమ్ము' దందా**

నిరుపేద మైనార్టీ వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కేటాయించే నిధుల కార్యక్రమాలలో పెద్ద ఎత్తున అవకతవకలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇండియన్ ఓవర్సీస్ పథకాలు, వివిధ రకాల లోన్లకు సంబంధించిన సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారుల ఎంపిక విషయంలో ఈ కాంట్రాక్టు ఉద్యోగే కీలకంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వెల్లు వేత్తుతున్నాయి. ఇతను సూచించిన లబ్ధిదారుల జాబితాకే ఆమోదం లభిస్తోందని, జాబితాలో పేరు చేర్చడానికి, నిధులు మంజూరు చేయడానికి లబ్ధిదారుల నుంచి భారీగా 'కమిషన్లు' వసూలు చేస్తున్నారన్న తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ఇతని అవినీతి అక్రమాలను, ప్రశ్నించిన సామాన్యులను, లబ్ధిదారులను తనకు ఉన్న రాజకీయ నాయకుల అండదండలతో, పలుకుబడి ఉన్న వ్యక్తులతో బెదిరింపులకు పాల్పడుతున్నట్లు, తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలల్లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల నియామకాలలోనూ భారీ అవినీతికి పాల్పడినట్లు బాధితులు బహిరంగంగా ఆరోపణలు చేస్తున్న అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదని సమాచారం. అత్యంత కీలకమైన మైనార్టీ సంక్షేమ శాఖ బ్యాంక్ అకౌంట్ నిర్వహణ కూడా ఈ కాంట్రాక్టు ఉద్యోగి ఆధీనంలోనే నడుస్తోందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే రెగ్యులర్ ఉద్యోగులను నియమించి ఈ శాఖను సాధారణ స్థితికి తీసుకురావాలని సంక్షేమ కార్యక్రమాలు అందరికీ అందుబాటులో ఉండే విధంగా చూడాలని మైనార్టీ వర్గాలు పలువురు సామాజిక కార్యకర్తలు జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు.

# ప్రజలకు చిత్తశుద్ధితో వైద్య సేవలు అందించాలి

### ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు సౌకర్యాలు వైద్య సిబ్బంది పనితీరు ఔషధాల లభ్యత పరిశుభ్రత తదితర అంశాలను కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రిలోని ఔషధాల నిల్వ గదిని సందర్శించి అక్కడ నిల్వ ఉంచిన మందుల స్టాక్‌ను పరిశీలించారు. మందులపై ఉన్న ఎక్స్‌పైరీ తేదీలను స్వయంగా తనిఖీ చేసి గడువు ముగిసిన మందులు ఎట్టి పరిస్థితుల్లోనూ రోగులకు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అవసరమైన అన్ని రకాల మందులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం అవుట్ పేషంట్ విభాగాన్ని సందర్శించిన కలెక్టర్ రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద ఏర్పాటు చేసిన క్యూ లైన్లను పరిశీలించారు. ప్రతిరోజు ఆసుపత్రికి ఎంతమంది ఓపి రోగులు వస్తున్నారు అనే విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోగులు ఎక్కువ సేపు వేచి ఉండకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఓపి విభాగంలో క్యూలైన్లో ఉన్న రోగులతో కలెక్టర్ మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవల విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైతే వెంటనే ఆసుపత్రి అధికారుల దృష్టికి తీసుకురావాలని రోగులకు సూచించారు.ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సమయానికి వైద్య సేవలు అందేలా వైద్యులు సిబ్బంది పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన అన్ని రకాల మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని ఔషధాల కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రతను కచ్చితంగా పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

EDITORIAL సంపాదకీయం

# అగ్రరాజ్యంలో అంబానీ సామ్రాజ్యం

అగ్రరాజ్యం అమెరికాలో దిగ్గజ పారిశ్రామిక వేత్త ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్ట్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అమెరికాలోని టెక్సాస్ బ్రౌన్స్‌విల్ ప్రాంతంలో దాదాపు 50 ఏళ్ల తర్వాత ఒక కొత్త, అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రాన్ని నిర్మించబోతున్నట్లు, ఈ ప్రాజెక్ట్ విలువ 300 బిలియన్ డాలర్లు (రూ. 27 లక్షల కోట్లు) అని ప్రకటించారు యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్. దీంట్లో రిలయన్స్ ఇండస్ట్రీస్.. భారీగా పెట్టుబడులు పెట్టనుందని ట్రంప్ స్వయంగా ప్రకటించారు. రిలయన్స్ కీలక భాగస్వామ్యంతోనే ఈ ఆయిల్ రిఫైనరీ ఏర్పాటు కానుందని చెప్పారు. ఈ ప్రాజెక్ట్‌తో అమెరికా ఇంధన ఉత్పత్తి పెరిగే అవకాశం ఉందని.. ఎగుమతులు పెంచేందుకు సాయపడుతుందని వెల్లడించారు. రిలయన్స్ కేవలం ప్రధాన పెట్టుబడిదారుగానే కాదు.. సాంకేతిక, నిర్మాణ భాగస్వామిగా ఉంటుంది. నిర్వహణ, శుద్ధి కూడా రిలయన్స్ చేతుల్లోనే ఉంటుంది. మార్కెటింగ్‌లోనూ కీలక పాత్ర రిలయన్స్ ఇండస్ట్రీస్‌దే అని చెప్పొచ్చు. ఇందులో భాగంగా 20 ఏళ్ల కాలానికి రిలయన్స్.. అమెరికాతో ఒప్పందం కుదుర్చుకుంది. అయితే ఇక్కడే చాలా మందిలో ఒక ప్రశ్న మెదులుతోంది. దాదాపు అన్ని రంగాల్లోనూ అగ్రగామిన ఉన్నటువంటి అమెరికాకు.. ఈ భారీ రిఫైనరీ ప్రాజెక్టులో రిలయన్స్ వంటి భారత సంస్థ అవసరం ఎందుకు? అని. ఇది అమెరికాకు ఎంత లాభం.. రిలయన్స్‌కు ప్రయోజనం ఏంటి? భారత్ అమెరికా వాణిజ్య సంబంధాలపై దీని ప్రభావం ఉంటుందా? చమురు మార్కెట్లో అమెరికా తిరుగులేని శక్తిగా ఎదిగేందుకు ఇది సహాయపడుతుందా? దీనికి సమాధానాల్ని చూద్దాం. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇప్పటికే ప్రపంచంలోనే అతిపెద్ద ఆయిల్ రిఫైనరీ కాంప్లెక్స్‌ను గుజరాత్ జామ్‌నగర్‌లో నిర్వహిస్తోంది. ప్రపంచంలోనే అత్యంత సమర్థవంతమైన రిఫైనరీల్ని నిర్మించిన ఈ రిలయన్స్ అనుభవం.. అమెరికాకు కావాలి. అలాగే.. అమెరికా వంటి అతిపెద్ద ఇంధన మార్కెట్లోకి నేరుగా ప్రవేశించే అవకాశం రిలయన్స్‌కు దక్కుతుంది. తక్కువ నాణ్యత కలిగిన ముడి చమురును కూడా అత్యంత స్వచ్ఛమైన పెట్రోల్, డీజిల్‌గా మార్చే టెక్నాలజీ రిలయన్స్ దగ్గర ఉంది. ప్రస్తుతం రష్యా సహా ఇతర దేశాల నుంచి తక్కువ ధరకు ముడి చమురును కొనుగోలు చేసి శుద్ధి చేయడంలో మంచి అనుభవం ఉంది. అమెరికా, ఐరోపా ప్రమాణాలకు తగ్గట్లుగా రూపొందించడంలో దిట్ట. ఇప్పుడు అమెరికాలో ప్లాంట్ ద్వారా.. అక్కడ విస్తృతంగా లభ్యమయ్యే.. షేల్ ఆయిల్‌ను తక్కువ ఖర్చుతో శుద్ధి చేసి లాభాలు పొందొచ్చు. ఇది అమెరికాకు కూడా ఎంతో మేలు చేయనుంది. ఇక్కడ అమెరికా కేవలం రిలయన్స్ నుంచి పెట్టుబడులు మాత్రమే ఆశించట్లేదు. ఏకంగా రిలయన్స్ బ్లూప్రింట్‌నే కోరుకుంటోంది.



అమెరికా కంపెనీలు చాలా వరకు గ్రీన్ ఎనర్జీ (విండ్, సోలార్) వైపు మొగ్గుచూపుతుండగా.. పెట్రోలియం రంగంలో ఇంత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టేందుకు అంతర్జాతీయ స్థాయిలో అనుభవం, అలాగే నగదు నిల్వలు రిలయన్స్ దగ్గర ఉన్నాయి. ఇతర దేశాలకు చెందిన కొన్ని కంపెనీలు ముందుకొచ్చినప్పటికీ.. అమెరికా నమ్మకమైన భాగస్వామిగా రిలయన్స్‌ను ఎంచుకుంది. ఇంకా రిలయన్స్ లో కాస్ట్ ఆపరేషన్ మోడల్ కూడా అమెరికాకు నచ్చిందని తెలుస్తోంది.

ఈ కొత్త ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్ట్ ప్రధానంగా షేల్ ఆయిల్ ఆధారంగానే నడుస్తుందని సదరు ప్రాజెక్టును పర్యవేక్షిస్తున్న అమెరికా ఫస్ట్ రిఫైనింగ్ (AFR) పేర్కొంది. అమెరికాలో ఇప్పటికే ఉన్న రిఫైనరీల్ని.. ఎక్కువగా గల్ఫ్ దేశాల నుంచి వచ్చే హెవీ ఆయిల్‌ను శుద్ధి చేసేలానే రూపొందించారు. అయితే అమెరికాలో ఎక్కువగా దొరికే షేల్ ఆయిల్‌ను శుద్ధి చేయడంలో రిలయన్స్‌కు మంచి పట్టు ఉంది. దీంతో ఈ రిఫైనరీలో ఉత్పత్తి అయ్యే ఇంధనాల్ని రిలయన్స్ కొనుగోలు చేయనుందని ఏఎఫ్ఆర్ తెలిపింది. అందుకే అక్కడ ప్లాంట్ ఉండటం వల్ల రవాణా ఖర్చులు తగ్గి లాభాలు ఇంకా పెరుగుతాయని చెప్పొచ్చు. సింపుల్‌గా చెప్పాలంటే.. ఇక్కడ అమెరికా దగ్గర ముడి చమురు ఉంది. రిలయన్స్ దగ్గర డబ్బు, అత్యాధునిక టెక్నాలజీ ఉంది. ఈ సామర్థ్యాలతో షేల్ గ్యాస్ ఆధారిత చమురును శుద్ధి చేసి తిరిగి అమెరికా మార్కెట్ సహా ఇతర దేశాలకు విక్రయిస్తుంది. వచ్చే లాభాల్ని పంచుకుంటాయి.

ఈ ఒప్పందంలో భాగంగా మొత్తంగా.. 125 బి.డాలర్ల విలువైన క్రూడాయిల్, 175 బి.డాలర్ల విలువైన రిఫైన్డ్ ప్రొడక్ట్స్ ఉత్పత్తి జరుగుతుంది. దీంతో అమెరికా రోజుకు 13.6 మిలియన్ బ్యారెల్స్ చమురు ఉత్పత్తి చేస్తుంది. ఇది సౌదీ అరేబియా, రష్యా కంటే ఎక్కువ. 20142024 మధ్య 10 బిలియన్ బ్యారెల్స్ సొంత ఆయిల్‌ను ఎగుమతి చేసి, 1.8 ట్రిలియన్ డాలర్ల విలువైన విదేశీ చమురును దిగుమతి చేసుకుంది. కారణం.. షేల్ ఆయిల్‌ను శుద్ధి చేసే చమురు కర్మాగారాలు పెద్దగా లేకపోవడమే. ఆ కొరతను తీర్చుకునేందుకే ఇప్పుడు పెద్ద రిఫైనరీని నిర్మిస్తోంది.

## రిలయన్స్ కు ఏం లాభం?

ఇప్పటికే అమెరికా సహా పలు దేశాలకు రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇంధనాన్ని విక్రయిస్తుండగా.. అమెరికాలో ఆయిల్ రిఫైనరీలో భాగస్వామ్యంతో.. అంతర్జాతీయంగా తన ముడి చమురు సరఫరాను విస్తరించుకునేందుకు ఇది మరో వ్యూహాత్మక ఎత్తుగడ అవుతుంది. దీంతో మరో 20 ఏళ్ల పాటు తన ఉత్పత్తుల విక్రయంతో ఆదాయానికి ఢోకా ఉండకపోవచ్చు. ఒక భారత కంపెనీ అమెరికాలో ఇంత పెద్ద ప్రాజెక్ట్ చేయడం వల్ల, దీర్ఘకాలంలో అంతర్జాతీయ ఇన్వెస్టర్లకు భారతీయ కంపెనీల సామర్థ్యంపైనా నమ్మకం పెరుగుతుంది.

## అమెరికాకు ఏం లాభం?

ప్రధానంగా సొంత దేశంలో ఉత్పత్తి పెరగడం వల్ల విదేశీ దిగుమతులపై ఆధారపడటం తగ్గించుకోవచ్చు. స్థానికంగా వేలాది మందికి ఉపాధి కలుగుతుంది. దీంతో ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుంది. ఇప్పటివరకు చమురు విషయంలో గల్ఫ్ దేశాల ఆధిపత్యమే ఎక్కువగా ఉండేది. అదే అమెరికాలో ఇలాంటి భారీ రిఫైనరీలు వస్తే.. చమురు మార్కెట్ నియంత్రణ.. గల్ఫ్ దేశాల చేతుల నుంచి అమెరికా, భారత్ వంటి భాగస్వామ్య దేశాల వైపు మళ్లుతుంది. చమురు రంగంలో చైనా ప్రభావం కూడా ఏమాత్రం పెరగకుండా చూడాలని అమెరికా భావిస్తోంది. భారత్‌కు చెందిన రిలయన్స్ వంటి సంస్థతో డీల్ చేసుకోవడం వల్ల అమెరికాకు ఒక భరోసా ఉంటుంది. రష్యాపై ఇప్పటికే ఆంక్షల కారణంగా.. ఐరోపా, అమెరికా దేశాలు బలమైన ప్రత్యామ్నాయం కోసం చూస్తున్నాయి. ఇప్పుడు.. అమెరికాలోనే రిఫైనరీ ఉండటం వల్ల.. ముడి చమురును ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన అవసరం తగ్గుతుంది. ఇది అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగినా అమెరికా మార్కెట్‌ను కాపాడుతుంది.

## తగ్గనున్న పెట్రోల్, డీజిల్ ధరలు..

భారత్ రష్యా నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లుగా.. సాధారణంగా ముడిచమురు ఒక చోట దొరుకుతుంది.. మరో చోట శుద్ధి అవుతుంది. అక్కడి నుంచి వినియోగదారులకు చేరుతుంది. దీనివల్ల రవాణా ఖర్చులు సాధారణంగానే చాలా ఎక్కువగా ఉంటాయి. అదే ఇప్పుడు అమెరికాలోనే చమురు వెలికి తీసి.. అక్కడే రిఫైనరీలో శుద్ధి చేస్తే.. రవాణా ఖర్చులు పెద్దమొత్తంలో తగ్గుతాయి. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గే అవకాశం ఉంటుంది.

## భారత్‌కు ప్రయోజనం ఏంటి?

భారత్ ఇప్పటికీ చమురు విషయంలో ఎక్కువగా రష్యా సహా ఇరాక్, సౌదీ అరేబియా వంటి మిడిల్ ఈస్ట్ దేశాలపైనే ఆధారపడుతోంది. భారత చమురు అవసరాల్లో 80 శాతానికిపైగా దిగుమతుల నుంచే వస్తుంది. చమురు రవాణాకు కీలకమైన.. హోర్ముజ్ జలసంధి దగ్గర ఏదైనా ఆటంకం వస్తే.. భారత ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం కలుగుతోంది. ఇప్పుడు అమెరికాలో కొత్త ఆయిల్ రిఫైనరీ.. భారత్‌కు స్థిరమైన చమురు సరఫరాను అందిస్తుందని చెప్పొచ్చు. ఇది మిడిల్ ఈస్ట్ దేశాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. సెబీ రిజిస్టర్డ్ ఫైనాన్షియల్ పార్ట్‌నర్ వివేక్ ఖాత్రి ప్రకారం.. ఇది భారత్‌కు ఇన్సూరెన్స్ పాలసీ వంటిది. రష్యా నుంచి డిస్కౌంట్‌లో చమురు పొందడం, మిడిల్ ఈస్ట్ దేశాలతో ఎప్పటినుంచో ఒప్పందాలు ఉండటం, అమెరికాతో తాజా డీల్ ఒక మల్టీ సోర్స్ వ్యూహం అని చెబుతున్నారు.

మరోవైపు.. భారత్ అమెరికా మధ్య ప్రస్తుతం వాణిజ్య సంబంధాలు మరీ అంత గొప్పగా ఏం లేవు. ఇప్పటికీ ట్రంప్.. విచ్చలవిడిగా భారత ఉత్పత్తులపై సుంకాలు విధిస్తూనే ఉన్నారు. ఎప్పుడేం చేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. చాలా కాలం తర్వాత ఇటీవలే పూర్తి స్థాయిలో కాకుండా.. రెండు దేశాల మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఇప్పుడు రిలయన్స్ భాగస్వామ్యంతో.. ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలు మరింత బలపడే అవకాశం ఉందని చెప్పొచ్చు.

## షేల్ ఆయిల్ అంటే?

షేల్ ఆయిల్ భూగర్భంలోనే ఉండే ఒక రకమైన అసాధారణ ముడి చమురు. సాధారణ చమురుతో పోలిస్తే భిన్నంగా ఉంటుంది. ఇది భూ ఉపరితలం కింద చాలా లోతులోని షేల్ అనే గట్టి పొరల రాళ్ల మధ్య చిక్కుకొని ఉంటుంది. సాధారణ చమురు బావుల్లా దీనిని పైపులు వేసి తోడలేరు. హారిజొంటల్ డ్రిల్లింగ్, హైడ్రాలిక్ ఫ్రాక్చరింగ్ అనే ప్రత్యేక పద్ధతుల్లో ఈ చమురును వెలికితీస్తారు. ఇది చాలా కాస్ట్‌లీ ప్రాసెస్. అందుకే సాధారణ చమురుతో పోలిస్తే.. షేల్ ఆయిల్ తీసేందుకు కొంచెం ఎక్కువ ఖర్చే అవుతుంది. దీనిని శుద్ధి చేసేందుకు ప్రత్యేక రిఫైనరీ ప్లాంట్లు కావాలి. రిలయన్స్‌కు.. ఇప్పటికే అమెరికాలోని షేల్ ఆయిల్ క్షేత్రాల్లో పెట్టుబడులు పెట్టిన అనుభవం ఉంది కాబట్టి.. అమెరికా కూడా దీనివైపు మొగ్గుచూపింది.

## అంబానీ- ట్రంప్ 'దృఢ' బంధం..

ఈ నవంబరులో అమెరికాలో మధ్యంతర ఎన్నికలు జరగనున్నాయి. అధ్యక్ష ఎన్నికల వ్యవధి 4 ఏళ్లలో సరిగ్గా సగం అంటే 2 ఏళ్లకు ఇవి నిర్వహిస్తుంటారు. ఇది సాధారణంగా పాలనపై ప్రజాభిప్రాయాన్ని సూచిస్తుంది. ఈ నేపథ్యంలో ఈ డీల్‌ను ట్రంప్ తెరపైకి తీసుకొచ్చారని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ఈ రిలయన్స్‌తో డీల్ వ్యవహారం.. ఇదంతా ఇప్పుడు మొదలైంది కాదు. ఎప్పటినుంచో చర్చలు జరుగుతున్నట్లు భావిస్తున్నారు. దీనికి మరింత బలం చేకూర్చేలా.. భారత్‌కు అమెరికా రాయబారి అయిన ట్రంప్ సన్నిహితుడు సెర్గియో గోర్ ఇటీవల టీ20 ప్రపంచకప్‌లో ఇండియా అమెరికా మ్యాచ్ సందర్భంగా ముకేశ్ అంబానీ పక్కన కూర్చొని చర్చిస్తుండటం కెమెరాలకు చిక్కింది. దీంతో ఎన్నో ఏళ్లుగా ట్రంప్ అంబానీ కుటుంబం మధ్య కొనసాగుతున్న బంధాన్ని మరో ఎత్తుకు తీసుకెళ్లినట్లు కూడా చెబుతున్నారు.

# చాణక్యుని సక్సెస్ టిప్స్..

## విజయానికి మిస్ కాకూడని మార్గదర్శకాలు

**చాణక్య నీతి" పుస్తకం మనకు జీవితానికి మార్గదర్శకంగా పనిచేసే అనేక సూత్రాలను అందిస్తుంది. ఈ పుస్తకంలో చాణక్యుడు చెప్పారు కొన్ని ముఖ్యమైన సూత్రాలు, ఇవి తప్పుడు మార్గంలో వెళ్లే ముందు మనం గమనించాల్సిన సంకేతాలా ఉన్నాయి. ఈ సూత్రాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.**

ఆచార్య చాణక్యుడు గొప్ప ఆలోచనాపరుడు, ఆర్థికవేత్త, దౌత్య నిపుణుడు. ఆయన రాసిన "చాణక్య నీతి" పుస్తకం మనకు జీవితానికి మార్గదర్శకంగా పనిచేసే అనేక సూత్రాలను అందిస్తుంది. ఈ పుస్తకంలో చాణక్యుడు చెప్పారు కొన్ని ముఖ్యమైన సూత్రాలు, ఇవి తప్పుడు మార్గంలో వెళ్లే ముందు మనం గమనించాల్సిన సంకేతాలా ఉన్నాయి. ఈ సంకేతాలను విస్మరిస్తే, మనం సవాళ్లను ఎదుర్కొనవలసి వస్తుంది.

### 1. సీనియర్లు, అనుభవజ్ఞుల సలహాలను వినకపోవడం:

చాణక్యుడు చెప్పినట్లుగా, మనకంటే పెద్దవారి అనుభవం ఎంతో విలువైనది. వారి సలహాలను విస్మరిస్తే, మన పతనం అక్కడి నుండి ప్రారంభమవుతుంది. అందువల్ల, అనుభవజ్ఞుల సలహాలను గౌరవించాలి, మనం మరింత జాగ్రత్తగా ఉండాలి.

### 2. అహంకారం:

చాణక్యుడు అన్నారు, "అహంకారం మనిషి అతిపెద్ద శత్రువు." ఏదైనా విషయంపై గర్వపడటం, మన దారిని తప్పుగా మారుస్తుంది. అహంకారంలో పడిన వ్యక్తి మంచి, చెడు మధ్య తేడాను గుర్తించలేడు. అది చివరికి విషాదానికి దారితీస్తుంది.



### 3. సత్వరమార్గాలు:

విజయం సాధించడానికి సులభ మార్గాలను తీసుకోవడం తాత్కాలిక విజయాన్ని ఇచ్చే అవకాశం ఉంది, కానీ అది శాశ్వతం కాదు. చాణక్యుడు స్పష్టం చేశారు: "విజయానికి సత్వరమార్గం లేదు." ఏదైనా సులభ మార్గాన్ని ఆశిస్తూ ఉంటే, మనం మనల్ని మనమే మోసం చేస్తున్నట్లే. సారాంశంగా, చాణక్యుడి ఈ సూత్రాలు నేరుగా మన జీవితానికి ఉపయోగపడతాయి. జాగ్రత్తగా ఉండి, అహంకారాన్ని తప్పించుకొని, అనుభవజ్ఞుల సలహాలను గౌరవిస్తూ, ధైర్యంగా, నిశ్చితంగా జీవితంలో ముందుకు పోతే మాత్రమే నిజమైన విజయాన్ని సాధించవచ్చు.

# పుణ్యక్షేత్రాల దర్శనం ఎందుకు చేయాలి..? ఎవరు చేయాలి..?

*హిందూ ధర్మంలో పూజలు, వ్రతాలు ఎంత ముఖ్యమో, పుణ్య తీర్థ యాత్రలు కూడా అంతే ప్రాముఖ్యత కలిగి ఉంటాయి. తీర్థయాత్రలు చేయడం వల్ల పుణ్యం లభిస్తుంది, అలాగే ఆధ్యాత్మిక జ్ఞానం పెరుగుతుంది. పురాణాలు చెబుతున్నట్లు అనేక మహనీయులు, ఋషులు, పురాణ పురుషులు తీర్థయాత్రల ద్వారా ముక్తిని పొందారు. కొందరు కుటుంబంతోపాటు అందరూ కలిసి వెళ్లి పుణ్యక్షేత్రాలను సందర్శిస్తుంటారు. అయితే, పెద్ద వయస్సువారే ఎక్కువగా తీర్థయాత్రలు చేస్తుంటారు. దీంతో తీర్థయాత్రలకు పెద్దలు, వృద్ధులు వెళ్లాలా? అనే సందేహం ఏర్పడుతోంది. దీని గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం.*

**తీర్థయాత్రలు వయసు మళ్లిన వారే చేయాలా?**

సాధారణంగా చాలా మంది క్షేత్ర దర్శనం వృద్ధాప్యంలో చేయాలి అని భావిస్తారు. కానీ, నిజానికి యౌవనంలోనే పుణ్యక్షేత్రాలను దర్శించడం మంచిది. ఎందుకంటే ఆ సమయంలో శరీరంలో శక్తి ఉంటుంది, దూర ప్రాంతాలకు ప్రయాణం చేయడం సులభంగా ఉంటుంది. వయసు మళ్లిన తర్వాత సమయం ఉన్నా.. శరీరం సహకరించకపోవచ్చు. అందువల్ల శక్తి ఉన్నప్పుడు దివ్యక్షేత్రాలను దర్శించి పుణ్యం సంపాదించుకోవాలని పండితులు సూచిస్తున్నారు.

**తీర్థయాత్రల అవసరం**

దేవుడు ప్రతి చోటా ఉన్నప్పుడు అంత దూరం వెళ్లి క్షేత్ర దర్శనం చేయాల్సిన అవసరం ఏముంది? అనే సందేహం కూడా చాలా మందిలో ఉంటుంది. దేవుడు ఎక్కడైనా ఉన్నాడనే విషయం నిజమే. అయితే పుణ్యక్షేత్రాలకు ప్రత్యేకమైన స్థల మహాత్మ్యం ఉంటుంది. దేవతలు, ఋషులు, మహనీయుల పాదస్పర్శతో ఆ ప్రదేశాలు పవిత్రమై ఉంటాయి. అక్కడి నదులు, నీటికి కూడా ఔషధ గుణాలు ఉన్నాయని విశ్వసిస్తారు. అందుకే భారతీయ సంస్కృతిలో పుణ్యక్షేత్రాల దర్శనానికి ప్రత్యేక స్థానం ఉంది.

**పురాణాల్లో తీర్థయాత్రలు**

మహాభారతంలో వనవాస సమయంలో పాండవులు శ్రీకృష్ణుని ఆదేశంతో అనేక పుణ్యక్షేత్రాలను దర్శించినట్లు



పేర్కొనబడింది. అలాగే పరశురాముడు, మరెందరో మహర్షులు తీర్థయాత్రలు చేసి ముక్తిని పొందినట్లు పురాణాలు చెబుతున్నాయి. శ్రీరాముడు కూడా రావణ సంహారం అనంతరం బ్రహ్మహత్యా దోషం నివారణ కోసం అనేక పుణ్యక్షేత్రాలను సందర్శించినట్లు పురాణాలు చెబుతున్నాయి. శివపురాణంలో సాక్షాత్తు పరమశివుడు కూడా బ్రహ్మశిరస్సు ఖండించిన పాపం పోగొట్టుకోవడానికి బ్రహ్మకపాలాన్ని ధరించి అనేక తీర్థయాత్రలు చేసినట్లు వివరించబడింది. మహాభారతంలో కురుక్షేత్ర యుద్ధానికి ముందు బలరాముడు కూడా తీర్థయాత్రలు చేసినట్లు పేర్కొన్నారు.

**చరిత్ర ఉదాహరణలు**

రామాయణంలో శ్రవణ కుమారుడు తన అంధ తల్లిదండ్రులను కావడిలో మోసుకుంటూ తీర్థయాత్రలు చేయించిన కథ అందరికీ తెలిసిందే. అలాగే కొన్ని చారిత్రక గ్రంథాలలో సిద్ధుడు అనేక తీర్థయాత్రలు చేసి కేదారేశ్వరుడు, హింగులాంబిక దేవిని దర్శించినట్లు ఆధారాలు ఉన్నాయి. ఇలా మన పురాణాలు, ఇతిహాసాలు తీర్థయాత్రల ప్రాముఖ్యతను స్పష్టంగా వివరిస్తాయి.

**తీర్థయాత్రలు చేస్తే ఏమవుతుంది..?**

తీర్థయాత్రలు కేవలం పుణ్యం సంపాదించడానికి మాత్రమే కాదు, పురుషార్థాన్ని కూడా కలిగిస్తాయి. యాత్రల ద్వారా వివిధ ప్రాంతాల సంస్కృతి, ప్రజల జీవన విధానం, సామాజికఆర్థిక పరిస్థితులు తెలుసుకునే అవకాశం లభిస్తుంది. ఇతర యాత్రికులతో కలిసిమెలిసి ఉండటం ద్వారా సామాజిక సంబంధాలు కూడా మెరుగుపడతాయి. ఈ అనుభవాల సమాహారాన్నే పురుషార్థం అంటారు. పుణ్యక్షేత్రాలను ప్రత్యక్షంగా దర్శించడం మాత్రమే కాకుండా, వాటి మహత్యాన్ని చదవడం, వినడం, ఇతరులకు వివరించడం కూడా మోక్షానికి దారి చూపుతాయని శాస్త్రాలు చెబుతున్నాయి.

**దర్శించదగిన పుణ్యక్షేత్రాలు**

మన దేశంలో అనేక పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తిపీఠాలు, పంచారామాలు, త్రిలింగ క్షేత్రాలు, చార్‌ధామ్, పంచభూత క్షేత్రాలు వంటి అనేక పవిత్ర స్థలాలు తీర్థయాత్రలకు ప్రసిద్ధి. ముఖ్యంగా హిందువుగా జన్మించిన ప్రతి ఒక్కరూ సప్త మోక్షధామాలుగా ప్రసిద్ధి చెందిన అయోధ్య, మథుర, కంచి, మాయ, అవంతి, కాశీ, ద్వారకాలను తప్పకుండా దర్శించాలని చెబుతారు.

# విద్యార్థులపై దాడి చేసిన కళాశాలపై చర్యలు తీసుకోవాలి..

### జేఎన్టీయూ, గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల కుమ్మక్కై విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు..

### ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్, కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్

**మొయినాబాద్ మహా:** విద్యార్థులపై దాడి చేసిన గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల పై చర్యలు తీసుకొని.. కళాశాలను రద్దు చేయాలని, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్, కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ లు పేర్కొన్నారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ... గ్లోబల్ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, జేఎన్టీయూ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేస్తున్నారని.. విద్యార్థులను కళాశాల వైస్ ప్రిన్సిపల్ హమ్మద్ జీసస్, ఫ్యాన్ మహేష్ తో కలిసి దాదాపు రెండు గంటల పాటు విద్యార్థులను గదిలో బంధించి గ్లోబల్ కళాశాలకు చెందిన విద్యార్థులు సిఎస్ఈ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మహమ్మద్ సాదిక్, కృతిక్ రెడ్డి, హైమత్ అజార్, నిఖిల్ కుమార్, సంతోష్, సిఎస్ ఈ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు.. ఉదయ్, అజ్రత్లపై దాడి చేశారన్నారు. జేఎన్టీయూ, గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల కుమ్మక్కై విద్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని వారు మండిపడ్డారు. వెంటనే ప్రభుత్వం స్పందించి గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై దాడి చేసిన కళాశాల అధ్యాపకులపై కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు అల్లీ దేవేందర్, ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్, అధ్యక్షులు రష్వంత్, తదితరులు పాల్గొన్నారు.



## భారాస ముక్కలైంది.. బీజేపీకి రాష్ట్రంలో చోటు లేదు

### కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొక్క బాలకృష్ణారెడ్డి



**మొయినాబాద్ మహా:** వచ్చే శాసన సభ ఎన్నికల్లో వందసీట్లు సాధించి తెలంగాణలో మరోసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొక్క బాలకృష్ణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాల కాలంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుండడమే ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని కనకమామిడి గ్రామంలో మాట్లాడుతూ భారాస నాలుగు ముక్కలైందని, రాష్ట్రంలో బీజేపీకి చోటే లేదని వ్యాఖ్యానించారు. అన్ని వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అండగా ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అని.. వారికి సముచిత స్థానం కల్పిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని తెలిపారు. వచ్చే శాసన సభ ఎన్నికల్లో వంద సీట్లు గెలుచుకొని మరోసారి అధికారంలోకి కాంగ్రెస్ పార్టీ రావడం ఖాయమని.. మున్సిపల్ ఎన్నికల మాదిరి వచ్చే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం జరుగుతుందని బొక్క బాలకృష్ణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు కన్నుమూత

- కొండిగారి రాములు ఒక మహోన్నతమైన వ్యక్తి
- మరో పుచ్చలపల్లి సుందరయ్యను కోల్పోయాం
- అసెంబ్లీలో ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు
- ఆయన పార్థివదేహాన్నికి నివాళులర్పించిన ఎమ్మెల్యే రంగారెడ్డి
- ఆయన మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతికి లోనైన ఎమ్మెల్యే రంగారెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రాజకీయాల్లో మచ్చ లేని నాయకుడు కొండిగారి రాములు అని ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు కొండిగారి రాములు శుక్రవారం ఉదయం కన్నుమూశారు. రాములు భౌతిక కాయానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నివాళులు అర్పించారు. కొండిగారి రాముడు మరణవార్త తనని తీవ్రంగా కలిసివేసిందని ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాజకీయాల్లో మచ్చ లేని నాయకుడు కొండిగారి రాములు అని అన్నారు. స్వార్థం, అధికార కోసం పార్టీలు మారుతున్న ఈ కాలంలో నమ్ముకున్న సిద్ధంతం కోసం ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తట్టుకుని నిలిచినా వ్యక్తి కొండిగారి రాములు అని అన్నారు.ఎమ్మెల్యే కాగానే అక్రమార్జన కోసం వెంపర్లాడే ఈ సమాజంలో, ఎమ్మెల్యేగా ఉన్న రోజుల్లో వచ్చిన తన కొద్దిపాటి జీతాన్ని కూడా పార్టీకోసం విరాళంగా ఇచ్చిన గొప్ప నాయకుడు మన కొండిగారి రాములు అని ఎమ్మెల్యే కొనియాడారు. దశబ్దకాలం శాసనసభ్యునిగా పని చేసినప్పటికి సొంతంగా ఏమి ఆశించకుండా నిరంతరం ప్రజలకోసం పాటుపడిన వ్యక్తిని కోల్పోవటం చాలా బాధాకరం ఉందని ఆయన అన్నారు. అణగారిన వర్గాల కోసం అయినా చేసిన పోరాటం వర్ణింపలేనిదని, ఆయన తుదిశ్వాస వరకు నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉన్న గొప్ప వ్యక్తి అని అన్నారు. కొండిగారి రాములు జీవితాన్ని నేటితరం యువత ఆదర్శంగా తీసుకోవాలి. ఆయన మన మధ్య భౌతికంగా లేకపోయినా నియోజకవర్గ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా ఉంటారు. కొండిగారి రాములు కుటుంబానికి తాను ఎల్లవేళల అండగా ఉంటానని, ఏ కష్టం వచ్చిన ఆ కుటుంబానికి అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే రంగారెడ్డి దైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, భూపతిగల్ల మహిపాల్, విష్ణువర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు కొండిగారి రాములు పార్థివదేహాన్నికి నివాళులు అర్పించారు.

## మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు ఇకలేరు

- నిద్రలోనే కన్నుమూసిన మాజీ ఎమ్మెల్యే రాములు
- తీవ్ర సంతాపం ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు కన్నుమూశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో నివాసం ఉంటున్న మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు, శుక్రవారం ఉదయం నిద్రలో నుండి లేచిన ఆయన నలతగా ఉందని మళ్లీ పడుకుని నిద్రలోనే కన్నుమూశారు. గత జూలై నెలలో ఆయన భార్య ముత్యాలమ్మ మరణించారు. మాజీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి మాట్లాడుతూ... 1989 నుండి 1999 వరకు సిపియం పార్టీ నుండి దశాబ్దకాలంపాటు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా ఆయన ప్రజలకు సేవలందించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఆయన చిన్న కుమారుడు కొండిగారి త్రిలోక్ కుమార్ ఇబ్రహీంపట్నం మున్సిపల్ కౌన్సిలర్ గా బిఆర్ఎస్ పార్టీ నుండి విజయం సాధించారు. మంచాల మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన ఆయన , కుమారులు కిరణ్ , త్రిలోక్ కుటుంబాలతో కలిసి ఆయన ఇబ్రహీంపట్నం బృందావన్ కాలనీలో నివసిస్తున్నారు. ముగ్గురు కుమారులలో పెద్ద కుమారుడు అరుణ్ కుమార్ అనారోగ్యంతో కొంతకాలంక్రితం మృతిచెందారు. నిజాయితీకి నిలువుటద్దంలా ప్రజలకు నిస్వార్థ సేవలందించిన కొండిగారి రాములు ఆకస్మిక మృతి పట్ల, మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి తీవ్ర ధిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి తపించిన అభ్యుదయవాదిని కోల్పోయామని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. వారి కుటుంబానికి అండగా నిలబడతామని చెప్పారు. బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, సత్తు వెంకటరమణారెడ్డి తదితరులు కొండిగారి రాములు మరణంపట్ల తీవ్ర సంతాపం తెలియజేశారు.

## వాణిజ్య కేంద్రాల వల్ల యువతకు ఉపాధి అవకాశాలు

### చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**మొయినాబాద్ మహా:** వాణిజ్య కేంద్రాల వల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. శుక్రవారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మొయినాబాద్ కేంద్రంలోని ఆర్ఎస్ ఫ్యాషన్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథులుగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, మొయినాబాద్ మున్సిపల్ చైర్మన్ సోనియా దర్శన్, కౌన్సిలర్ పల్లగోల్ల విజయలక్ష్మి అశోక్ యాదవ్, చేగురి అరుణ రామకృష్ణ గౌడ్ లు పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే కాలే షాపింగ్ మాల్లో తిరుగుతూ.. వస్త్రాలను పరిశీలించారు. యజమాని ఎమ్మెల్యే కాలే యాదయ్యకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. ఆర్ఎస్ షాపింగ్ మాల్ ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి వాణిజ్య కేంద్రాల వల్ల స్థానిక యువతకు ఎంతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మండల, మున్సిపల్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక.. రంజాన్

### మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్



**ఆమనగల్లు, మహా :** మత సామరస్యానికి ప్రతీక రంజాన్ మాసం అని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉప్పల వెంకటేష్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని కళ్యాణి గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సీనియర్ నాయకులు సయ్యద్ ఖలీల్ తో కలిసి ఉపవాస దీక్ష విరమించిన ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ.. ఇఫ్తార్ విందు కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతా భావాన్ని పెంచుతాయన్నారు. ఉపవాస దీక్షలు కుటుంబంతో పాటు సమాజంలో శాంతి, ప్రేమ, సోదరభావం, దాతృత్వం పెంపునకు దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్, బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, దుడ్డు ఆంజనేయులు,ఎనుమల్ల రమేష్,అనుష శ్రీశైలం, నాగిళ్ల జగన్,ఎఎంసి మాజీ మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్ రెడ్డి, నాయకులు జహంగీర్, చుక్క నిరంజన్ గౌడ్,వస్పుల సాయిలు, వడ్డేమోని శివకుమార్,గుజ్జరి గోపి, చాంద్ పాషా, పూసల భాస్కర్ ,మంచుకొండ జగదీష్, కిషోర్ నాయక్, సైదులు గౌడ్, ఈశ్వర్, చక్రి నాయక్, రమేష్ నాయక్,చాంద్, యాదగిరి, రంజిత్, టిప్పు సుల్తాన్,ఆయా మజీద్ కమిటీ అధ్యక్షులు మాసూమ్, గౌస్, ఖాదర్ ఖాద్రి, జహంగీర్, మహబూబ్, షరీఫ్, బాబా, అబ్బు, ఫరూక్, అహ్మద్, హనీఫ్, ఖలీమ్, అఫ్రోజ్, రఫీ, తదితరులు ఉన్నారు.

## కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో మొల్లమాంబకు నివాళులు


### రోగులకు పండ్ల పంపిణీ



**ఆలేరు, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల కేంద్రంలో ప్రముఖ తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను కుమ్మరి సంఘం ఆధ్యర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలేరు మండల అధ్యక్షుడు గంగాధరి సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సంఘ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొని మొదటగా ఆలేరు బస్టాండ్ ముందు మొల్లమాంబ చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆమె తెలుగు సాహిత్యానికి అందించిన విశేష సేవలను స్మరించుకుంటూ ఆమె రచనలు,సామాజిక ఆలోచనలను కొనియాడారు.మొల్లమాంబ తెలుగు భాషాభివృద్ధికి చేసిన కృషి నేటి తరం యువతకు ఆదర్శంగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు.అనంతరం ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేసి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.రోగుల ఆరోగ్యం మెరుగుపడాలని ఆకాంక్షిస్తూ సంఘం సభ్యులు వారికి ధైర్యం చెప్పి పరామర్శించారు.ఈ సేవా కార్యక్రమం పట్ల స్థానిక ప్రజలు ప్రశంసలు వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కుమ్మరి సంఘం ఆలేరు మండల అధ్యక్షుడు గంగాధరి సుధీర్ కుమార్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.సమాజ సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధరి పరమేశ్వర్,జిల్లా మీడియా విభాగం అధ్యక్షులు గంగదారి శ్రావణ్ కుమార్,మండల ప్రధాన కార్యదర్శి జీవిలకపల్లి సత్యనారాయణ,ఉపాధ్యక్షుడు శనిగరం హరీష్,కొరుటూరి బిక్షపతి,గంగాధరి ఇస్తారి ,కొరుటూరి బాలరాజు,గంగాధరి సత్తయ్య,కొరుటూరి నరసింహులు,కట్కూరి సిద్ధులు,గంగాధరి సాయికిరణ్,తాడూరి భాస్కర్,కొరుటూరి ఉపేందర్,గంగాధరి మహేందర్,గ్రామ అధ్యక్షులు గంగాధరి పరమేష్,శనిగరం రవీందర్,తాడూరి గణేష్,నిడిగొండ ఆంజనేయులు,గంగాధరి శ్రీనివాస్,కట్కూరి బాలస్వామి ,కొరుటూరి శ్రీనివాస్,కట్కూరి రవి,తేరాల సిద్ధులు తదితరులు పాల్గొన్నారు.


## పేదల ఇండ్లు, భూములను పిఓటి నిషేధిత జాబిత నుండి తొలగించాలి

- మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి



**ఆలేరు, మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని పలు గ్రామాలు, పట్టణ కేంద్రంలో పెట్టిన 22A. ACT 1908.POT. ACT 1977 ప్రకారం ఇండ్లను భూములను ప్రోహిబిట్ నిషేధిత జాబిత నుండి వెంటనే తొలగించాలని బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆలేరు తహాశీల్దారు కార్యాలయం ముందు శుక్రవారం రోజు ధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ విప్,మాజీ ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి పాల్గొన్నారు..ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 22 A POT నిషేధిత జాబితా నుండి దశాబ్దాల తరబడి ఇండ్లు కట్టుకొని జీవిస్తున్న పేద మధ్య తరగతి ప్రజలు,వ్యవసాయ రైతుల పక్షాన అవసరమైతే సుప్రీం కోర్టుకు కూడ వెళ్లుతానన్నారు...నిషేధిత జాబితాలో పెట్టడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో వాటిని అమ్ముకోవడానికి లేదా లోన్ తీసుకోవడానకి ,లేదా ఇల్లు కటుకోవడానికి అవకాశం లేకుండా పోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు...ఈ విషయం పై ప్రజలు భయందోళనకు గుర్తైతున్నారని చెప్పారు...సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల ముందు ప్రజలకు ఈ విషయం తెలిస్తే కాంగ్రెస్ పార్టీని తగిన బుద్ధిచెప్పేవరని అన్నారుధర్నా అనంతరం తహాశీల్దారు ఆంజనేయులుకు వినతిపత్రం అందించారుఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వస్పరి శంకరయ్య, కొరుకొప్పుల కిష్టయ్య, కొలుపుల హరినాథ్,గంగుల శ్రీనివాస్, పుట్ట మల్లేష్ కౌన్సిలర్లు మౌనిక,యాట శివతో పాటు సర్పంచ్ జూకంటి అనిల్,శోభన్ బాబు నాయకులు రాం నర్సయ్య,కందుల శంకర్,నాగరాజుతో పాటు బాధితులు పాల్గొన్నారు.

## నిషేధిత జాబిత నుండి పేదల ఇండ్లు తొలగించాలని బిజెపి ధర్నా...



**ఆలేరు, మహా:** పేదల ఇండ్లు ,రైతులు వ్యవసాయ భూములను POT 22A నిషేధిత జాబితా నుండి వెంటనే తొలగించాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు తహాశీల్దారు కార్యాలయం ముందు బిజెపి ఆధ్వర్యంలో నేడు ధర్నా నిర్వహించారు... ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు చిరిగే శ్రీనివాస్,కామిటికారి కృష్ణ, తోట చిన్న మల్లయ్య,గంగేష్,జహంగీర్ బాధితులు పాల్గొన్నారుధర్నా అనంతరం తహాశీల్దారుకు మోమొరండం సమర్పించారు...

## ఆలేరు పట్టణంలో ఆర్టీఏ అధికారుల తనిఖీలు 5 ఇసుక ట్రాక్టర్లు సీజ్



**ఆలేరు, మహా:** రోడ్డు భద్రతను కాపాడేందుకు మరియు రవాణా నిబంధనలు కచ్చితంగా అమలు చేయించేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో శుక్రవారం ఆర్టీఏ అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లా రవాణా అధికారి సాయి కృష్ణ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ స్పెషల్ డ్రైవ్‌లో నిబంధనలు ఉల్లంఘిస్తూ నడుస్తున్న వాహనాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. ఈ తనిఖీలలో టాక్స్ చెల్లించని, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ లేని, ఇన్సూరెన్స్ లేకుండా నడుపుతున్న 5 ఇసుక ట్రాక్టర్లను అధికారులు సీజ్ చేశారు. రోడ్లపై నిబంధనలు పట్టించుకోకుండా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ప్రజల ప్రాణ భద్రతకు భంగం కలిగించే విధంగా నిబంధనలను ఉల్లంఘించే వాహనాలపై ఇకపై ఎలాంటి ఉపేక్ష ఉండదని ఆర్టీఏ అధికారులు స్పష్టం చేశారు. రవాణా చట్టాలను విస్మరించి వాహనాలు నడిపితే భారీ జరిమానాలతో పాటు వాహనాలను సీజ్ చేయడం వంటి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.వాహన యజమానులు తప్పనిసరిగా టాక్స్, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ వంటి పత్రాలను సక్రమంగా నిర్వహిస్తూ రవాణా నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రజల ప్రాణాల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఇలాంటి ప్రత్యేక తనిఖీలు తరచూ కొనసాగుతాయని తెలిపారు.ఈ తనిఖీలలో అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్లు శ్రీ హర్షవర్ధన్ రెడ్డి, ప్రణీత్ రెడ్డి, హోం గార్డ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాజపేట ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**ఆలేరు, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి.ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే పేషెంట్లకు అన్ని రకాల వైద్య సేవలందించాలని కలెక్టర్ వైద్యాధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పిహెచ్సి లోని రోజు ఆసుపత్రికి ఎందరు రోగులు వస్తున్నారని, ఎందరు గర్భిణులు వైద్య సేవలు పొందుతున్నారని ఆరా తీశారు. వచ్చిన వాళ్ల వివరాలు ఆన్లైన్ లో రిజిస్టర్ చేయాలని సూచించారు.వైద్య పరీక్షలు చేసిన తర్వాత పేషెంట్లకు ఏ ఏ ట్రీట్మెంట్, మెడిసిన్స్ ఇచ్చారు అది కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. ఆస్పత్రిలో ల్యాబ్, మెడికల్, లేబర్ రూమ్ లను పరిశీలించారు. గత నెలలో ఎన్ని డెలివరీలు జరిగాయని అందులో సాధారణ ప్రసవాలు ఎన్ని జరిగాయని అడిగి తెలుసుకొని సాధారణ ప్రసవాల ఎక్కువగా అయ్యేలా చూడాలన్నారు. రోగులతో మాట్లాడుతూ ఏ సమస్యతో వచ్చారని అడిగి తెలుసుకొని వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.



### వేసవి సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ పై జాయింట్ డైరెక్టర్‌ను కలిసిన

## అంగన్వాడీ సంఘం ప్రతినిధులు




**కుషాయిగూడ, మహా :** అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం హైదరాబాద్ కమిషనర్ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ అక్కేశ్వరరావును కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేసింది. ముఖ్యంగా వేసవి సెలవులకు సంబంధించిన అంశంపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ స్పందిస్తూ వేసవి సెలవులకు సంబంధించి సోమవారం నాటికి అధికారిక ఉత్తర్వులు జారీ అవుతాయని తెలిపారు. అలాగే 2024, 2025 సంవత్సరాల్లో పదవీ విరమణ పొందిన అంగన్వాడీ సిబ్బందికి పూర్తి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందలేదని సంఘం ప్రతినిధులు తెలియజేయగా, వాటికి అవసరమైన బడ్జెట్ మంజూరైందని, ఈ నెలలోనే బకాయిల చెల్లింపులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పదవీ విరమణ పొందిన వారికి పోషణ్ అభియాన్ నిధులను కూడా ఈ నెలలోనే విడుదల చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు 15 వేల అంగన్వాడీ టీచర్లు, ఆయాల పోస్టుల భర్తీకి ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చినట్లు పేర్కొన్నారు. ముందుగా అంగన్వాడీ హెల్పర్లుగా పనిచేస్తున్న అర్హులైన వారికి టీచర్లుగా పదోన్నతులు ఇచ్చిన తరువాత మిగిలిన ఖాళీలను భర్తీ చేస్తామని చెప్పారు. అంగన్వాడీ సిబ్బందికి నాణ్యమైన మొబైల్ ఫోన్లు అందించాలన్న డిమాండ్‌పై స్పందిస్తూ, ఫోన్లు ఇప్పటికే కార్యాలయానికి వచ్చినట్లు తెలిపారు. వాటి పంపిణీకి మంత్రి, ముఖ్యమంత్రి సమయం తీసుకుని త్వరలోనే సిబ్బందికి అందజేస్తామని చెప్పారు. ప్రతి సంవత్సరం వేసవి సెలవుల కోసం సంఘం వినతిపత్రం ఇవ్వాల్సిన పరిస్థితి లేకుండా ప్రభుత్వం నుంచే ముందస్తు ఆదేశాలు ఇవ్వాలని సంఘం ప్రతినిధులు కోరారు. వేతనాల విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలోనే చెల్లింపులు జరుగుతాయని జాయింట్ డైరెక్టర్ తెలిపారు. జాయింట్ డైరెక్టర్‌ను కలిసిన బృందంలో రాష్ట్ర అధ్యక్షురాలు సాయీశ్వరి, ప్రధాన కార్యదర్శి నందూరి కరుణకుమారి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ సిహెచ్ సీతామహాలక్ష్మి, దయావతి పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్లపై అపోహలు వద్దు

### బిజెపి మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జి ఏనుగు సుదర్శన్ రెడ్డి





**కుషాయిగూడ, మహా :** సోషల్ మీడియాలో గ్యాస్ సిలిండర్ల కొరతపై వస్తున్న అపోహలకు ప్రజలు లోను కాకూడదని మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఘట్‌కేసర్‌లోని ఈశ్వర గ్యాస్ ఏజెన్సీ గోదాం కార్యాలయాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏజెన్సీ సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఐఓసీఎల్ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి గ్యాస్ సరఫరా పరిస్థితులపై సమీక్షించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ దేశానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చొరవతో ప్రపంచంలోని పలు దేశాల నుంచి ఇంధన, గ్యాస్ సరఫరాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. అంతర్జాతీయ పరిస్థితులు ఎలా ఉన్నా దేశ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కేంద్ర ప్రభుత్వం అప్రమత్తంగా పనిచేస్తోందన్నారు. జిల్లా సివిల్ సప్లై అధికారులతో కూడా మాట్లాడి గ్యాస్ సరఫరా పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం కొంతవరకు సిలిండర్ల కొరత ఉన్నది వాస్తవమేనని, అయితే ప్రజలు అనవసరంగా భయపడకుండా అవసరం ఉన్నవారే మాత్రమే బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే బుకింగ్ చేసి సిలిండర్ డెలివరీ పొందిన వారు మళ్లీ బుకింగ్ కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా సహకరించాలని కోరారు. అలాగే ఏజెన్సీ సిబ్బంది లేదా డెలివరీ బాయ్స్ ఎవరైనా గ్యాస్ సిలిండర్లను బ్లాక్‌లో అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఘట్‌కేసర్ బీజేపీ ప్రధాన కార్యదర్శి చెల్లక శ్రీధర్, సీనియర్ నాయకులు గాయాల రాజేష్, ఏజెన్సీ మేనేజర్ వెంకటేష్, గోదాం ఇంచార్జ్ సుమన్, డెలివరీ ఏజెంట్ రఫిక్, ఆపరేటర్లు, గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఈ ఏడాది జీడీపీ జోరు

**అంచనాలు పెంచిన ఫిచ్ రేటింగ్స్.. క్రూడ్ 70 డాలర్ల స్థాయిలో ఉండొచ్చు .. రెండంకెల స్థాయిలో రుణ వృద్ధి**

**న్యూఢిల్లీ:** భారత జీడీపీ వృద్ధి అంచనాలను ఫిచ్ రేటింగ్స్ పెంచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025-26) 7.5 శాతం, వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2026-27) 6.7%, 2027-28లో 6.5% మేర వృద్ధి నమోదవుతుందని తాజా అంచనాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 7.4%, వచ్చే ఆర్థిక సంవత్సరానికి 6.4% చొప్పున వృద్ధి ఉంటుందని లోగడ పేర్కొనడం గమనార్హం. అంతర్జాతీయంగా ముడిచమురు ధర 2026లో బ్యారెల్‌కు సగటున 70 బ్యారెళ్ల స్థాయిలో ఉంటుందని అంచనా వ్యక్తం చేసింది. దేశీ డిమాండ్ ఈ ఏడాది వృద్ధిని నడిపించే కీలక అంశమని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వినియోగదారుల వ్యయాలు 8.6%, పెట్టుబడులు 6.9% చొప్పున పెరుగుతాయని తెలిపింది. 2025 డిసెంబర్‌తో ముగిసిన క్వార్టర్‌లో జీడీపీ వృద్ధి 7.8%కి పరిమితం కావడం తెలిసిందే. గతేడాది సెప్టెంబర్ త్రైమాసికంలో వృద్ధి రేటు 8.4%గా ఉంది. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో ఆర్థిక కార్యకలాపాలు భారత్‌లో నిదానించినట్టు సంకేతాలు కనిపిస్తున్నా యంటూ, అదే సమయంలో ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని, రుణ వితరణలో రెండంకెల వృద్ధి ఉన్నట్టు పేర్కొంది.




**పెట్టుబడుల వృద్ధి పుంజుకుంటుంది..**

స్వల్పకాలంలో పెట్టుబడుల వృద్ధి మందగించొచ్చని, సులభతర ఆర్థిక పరిస్థితులు, కనిష్ట స్థాయిలో వడ్డీ రేట్లతో వచ్చే ఆర్థిక సంవత్సరం ద్వితీయ అర్ధ భాగంలో పుంజుకోవచ్చని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేసింది. ఈ ఏడాది, వచ్చే ఏడాదికి వడ్డీ రేట్లు ప్రస్తుత స్థాయిల్లోనే స్థిరపడొచ్చని పేర్కొంది.

**ప్రపంచ జీడీపీ 2.6 శాతం**

ప్రపంచ జీడీపీ 2026లో 2.6%గా ఉంటుందని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేసింది. ఇరాన్ యుద్ధంతో ఇంధన ధరలు భారీగా పెరగకపోవచ్చని భావిస్తూ ఈ అంచనాకు వచ్చింది. ఒకవేళ చమురు ధర బ్యారెల్‌కు 100 డాలర్లకు చేరి, అక్కడే కొనసాగితే అది ప్రపంచ సరఫరా వ్యవస్థకు పెద్ద షాక్‌గా మారుతుందని తెలిపింది. హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేసిన నేపథ్యంలో క్రూడ్ ఈ నెలాఖరు వరకు 90-100 డాలర్ల స్థాయిలో కొనసాగొచ్చని పేర్కొంది.

# పాతాళానికి రూపాయి


**5 పైసల క్షీణతతో 92.30కు ఇంట్రాడేలోనూ రికార్డ్ కనిష్టం**

**ముంబై:** చమురు ధరల సెగతో దేశీ కరెన్సీ విలువ కరుగుతూనే ఉంది. తాజాగా డాలరుతో మారకంలో రూపాయి 5 పైసలు క్షీణించి 92.30 వద్ద ముగిసింది. వెరసి వరుసగా మూడో రోజు సరికొత్త కనిష్టానికి చేరింది. లండన్ మార్కెట్లో బ్రెంట్ చమురు బ్యారల్ 1.5 శాతం పుంజుకుని 102 డాలర్ల ఎగువకు చేరడం, ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు ఇండెక్స్ 0.5 శాతం బలపడి 100ను అధిగమించడం రూపాయిని దెబ్బతీశాయి. దీంతో ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో రూపాయి 92.33 వద్ద బలహీనంగా ప్రారంభమైంది. తదుపరి ఇంట్రాడేలో 92.47 వద్ద మరోసారి చరిత్రాత్మక కనిష్టాన్ని తాకింది. దేశీ స్టాక్స్‌లో విదేశీ ఇన్వెస్టర్ల భారీ అమ్మకాలు కొనసాగుతుండటం సైతం రూపాయిని బలహీనపరుస్తున్నట్లు ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి.




# 'ఘోస్ట్ టౌన్'గా మారిన దుబాయ్!

దుబాయ్ అంటే సాధారణంగా మెగా భవనాలు, విలాసవంతమైన రిసార్ట్‌లు, మిచెలిన్‌స్టార్ రెస్టారెంట్లతో ఆకర్షణీయమైన పర్యాటక నగరంగా ప్రపంచానికి తెలుసు. అయితే ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులతో దుబాయ్ పరిస్థితి మారిపోయింది. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన తర్వాత భద్రతా ఆందోళనలు పెరగడంతో దుబాయ్ నగరం క్రమంగా వెలవెలబోతూ 'ఘోస్ట్ టౌన్'ను తలపిస్తోంది. ఇరాన్ క్షిపణి దాడుల ప్రభావం గల్ఫ్ ప్రాంతంపై తీవ్రంగా పడింది. ఈ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో దుబాయ్‌లోని పలు బీచ్ బార్లు, స్విమ్మింగ్ పూల్స్, పర్యాటక ప్రదేశాలు ఖాళీగా కనిపిస్తున్నాయి. గూచీ వంటి హైఎండ్ దుకాణాలు కూడా తాత్కాలికంగా మూతపడ్డాయి. అలాగే దుబాయ్ పార్క్స్ అండ్ రిసార్ట్స్, గ్లోబల్ విలేజ్ థీమ్ పార్క్, ఐన్ దుబాయ్ అబ్జర్వేషన్ వీల్ వంటి ప్రముఖ పర్యాటక ఆకర్షణలను కూడా తాత్కాలికంగా మూసివేశారు. సాధారణంగా వీకెండ్ సమయంలో ట్రాఫిక్‌తో కిక్కిరిసే నగరం ఇప్పుడు అసాధారణంగా ప్రశాంతంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. అనేక హోటళ్లలో అతిథులు తగ్గిపోవడంతో యజమానులు తమ సిబ్బందికి సెలవులు ఇచ్చి పంపుతున్నారు. పర్యాటకులు లేకపోవడంతో హోటళ్లు తక్కువ ధరలకు గదులు అందిస్తున్నాయి.




ఉద్రిక్త పరిస్థితుల కారణంగా చాలా మంది స్థానికులు, పర్యాటకులు దుబాయ్‌ను విడిచివెళ్లినట్లు తెలుస్తోంది. మధ్యప్రాచ్యం నుంచి బయలుదేరే విమానాల్లో దాదాపు సగం విమానాలు రద్దు అయినట్లు ట్రావెల్ అనలిటిక్స్ సంస్థ తెలిపింది. ముఖ్యంగా దుబాయ్‌లో నివసిస్తున్న విదేశీయులు, వలస కార్మికులు తమ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచంలోని అత్యంత ప్రాచుర్యం పొందిన పర్యాటక గమ్యస్థానాల్లో ఒకటిగా నిలిచిన దుబాయ్ గత సంవత్సరం 19.59 మిలియన్ల మంది పర్యాటకులను ఆకర్షించింది. అయితే ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల వల్ల నగర ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అధికారులు మాత్రం తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకుంటూ, ప్రజలు ధ్రువీకరించని సమాచారాన్ని పంచుకోరాదని హెచ్చరిస్తున్నారు.

# ఇండిగో విమాన టికెట్లపై ఇంధన సర్‌చార్జీలు

**న్యూఢిల్లీ:** పశ్చిమాసియా సంక్షోభంతో విమాన ఇంధన ధరలు భగ్గుమన్న నేపథ్యంలో దేశీయంగా విమానయాన సంస్థలు టికెట్లపై అదనపు చార్జీలు విధిస్తున్నాయి. ఇప్పటికే ఎయిరిండియా చార్జీలు పెంచేయగా, తాజాగా ఇండిగో కూడా అదే బాట పట్టింది. మార్చి 14 నుంచి (నేడు) దేశీ, విదేశీ రూట్లలో బుక్ చేసుకునే టికెట్లపై రూ. 425 నుంచి రూ. 2,300 వరకు ఇంధన చార్జీలను విధిస్తున్నట్లు వెల్లడించింది. దేశీ రూట్లు, భారత ఉపఖండంలో తిరిగే ఫ్లయిట్లకు ఫ్యుయల్ చార్జ్ రూ. 425గా, పస్చిమాసియా సర్వీసులకు రూ. 900గా ఉంటుందని సంస్థ తెలిపింది. ఇక ఆగ్నేయాసియా, చైనా, ఆఫ్రికా ఫ్లయిట్లకు రూ. 1,800గా, యూరప్ రూట్లలో రూ. 2,300గా చార్జీ ఉంటుంది. ఇప్పటికే ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ దేశీ రూట్లలో విధిస్తున్న రూ. 399 కన్నా ఇది అధికంగా ఉండటం గమనార్హం. ఎయిర్‌లైన్స్ నిర్వహణ వ్యయాల్లో ఏటీఎఫ్ వాటా 40 శాతం ఉంటుంది.




## దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL



# దుబాయ్‌లో జరిమానాలపై కొత్త చట్టానికి ఆమోదం

దుబాయ్‌లో ప్రభుత్వ సంస్థలు, ప్రజలకు వర్తించే ఉల్లంఘనలు, జరిమానాలపై కొత్త చట్టానికి దుబాయ్ పాలకుడు, యూఏఈ ప్రధాన మంత్రి షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ ఆమోదం తెలిపారు. పారదర్శకత, న్యాయాన్ని పెంపొందించే ఉద్దేశంతో 2026 సంవత్సరానికి సంబంధించి చట్టం నెం.6ను ప్రకటించారు. ఉల్లంఘనలపై చర్యలు తీసుకునే విధానంపై మరింత స్పష్టత తీసుకొచ్చేలా ఈ చట్టాన్ని రూపొందించారు. ఈ చట్టం ప్రధానంగా ప్రభుత్వ స్థాయిలో జరిగే ఉల్లంఘనలకు స్పష్టమైన చట్టపరమైన వ్యవస్థను ఏర్పాటుచేయడం లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే అధికార దుర్వినియోగాన్ని నిరోధించడం, చట్టాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచడం కూడా దీని ఉద్దేశంగా ఉంది. ఉల్లంఘనలను వాటి తీవ్రత ఆధారంగా చిన్న, మధ్యస్థ, తీవ్రమైనవిగా వర్గీకరించి, ప్రతి ఉల్లంఘనకు తగిన శిక్షను విధించేలా నిబంధనలు రూపొందించారు.

చట్టం ప్రకారం ఉల్లంఘనలకు పాల్పడిన వ్యక్తులు లేదా సంస్థలపై అధికారులు పలు రకాల చర్యలు తీసుకోవచ్చు. జరిమానా విధించే ముందు లేదా తరువాత పరిస్థితిని సరిచేసుకునే అవకాశం కల్పిస్తూ హెచ్చరికలు జారీ చేయవచ్చు. అవసరమైతే సంస్థలను ఆరు నెలల వరకు తాత్కాలికంగా లేదా శాశ్వతంగా మూసివేయవచ్చు. అలాగే వ్యక్తులు లేదా సంస్థలకు ఇచ్చిన లైసెన్సులు, అనుమతులను రద్దు చేయడం లేదా సవరించడం కూడా చేయవచ్చు. ఉల్లంఘనలకు సంబంధించిన ప్రాజెక్టులు లేదా కార్యకలాపాలను తాత్కాలికంగా లేదా శాశ్వతంగా నిలిపివేసే అధికారాన్ని కూడా ఈ చట్టం కల్పిస్తోంది. ఇక చర్యల ప్రక్రియలో పారదర్శకతను తప్పనిసరి చేశారు. ప్రతి ఉల్లంఘనను స్పష్టంగా నిర్వచించాల్సి ఉంటుంది. జరిమానాలు లేదా శిక్షలు నిర్ణయించే సమయంలో ఉల్లంఘన తీవ్రత, అది పునరావృతమైందా లేదా, ఉద్దేశపూర్వకంగా జరిగిందా వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. క్రమశిక్షణా చర్యలను ప్రకటించే ముందు సంబంధిత ప్రభుత్వ సంస్థల అధిపతుల అనుమతి తప్పనిసరి. అదేవిధంగా సమాచారం విడుదలలో దుబాయ్ మీడియా ఆఫీస్‌తో సమన్వయం చేయాలని కూడా నిబంధనలు పేర్కొంటున్నాయి. శాంతి భద్రతను కాపాడుతూ చట్టబద్ధమైన పాలనను మరింత బలోపేతం చేయడమే ఈ కొత్త ఉత్తర్వుల ప్రధాన లక్ష్యంగా అధికారులు తెలిపారు. అధికారిక గెజిట్‌లో ప్రచురించిన తేదీ నుంచి ఈ చట్టం అమల్లోకి వస్తుంది. దీనికి విరుద్ధంగా ఉన్న పాత చట్టాలు రద్దయినట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

# ర్యాలీపై దాడులు!

**దుబాయ్/వాషింగ్టన్/జెరూసలేం:** పశ్చిమాసియాలో యుద్ధం తీవ్రస్థాయిలో కొనసాగుతూనే ఉంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్ శుక్రవారం భారీ పేలుళ్లతో దద్దరిల్లిపోయింది. శుక్రవారం నగరం నడిరోడ్డున అత్యంత శక్తిమంతమైన పేలుళ్లు సంభవించాయి. ప్రఖ్యాత ఫిరదౌసీ స్క్వేర్ వద్ద ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన ఖుద్స్ డే ప్రదర్శనల్లో ప్రజలు వేలాదిగా పాల్గొని ఉండగా ఈ ఉదంతం జరిగినట్టు ప్రభుత్వ టెలివిజన్ పేర్కొంది. పేలుడు కారణమేమిటో తెలియకపోయినా ఆ ప్రాంతంపై దాడి చేస్తామని శుక్రవారం ఉదయమే ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరించింది. అంతేగాక ఫిరదౌసీ స్క్వేర్ వద్ద ర్యాలీలు మొదలయ్యేందుకు కాసేపటి ముందే టెహ్రాన్‌పై ఇజ్రాయెల్-అమెరికా భారీ స్థాయి వైమానిక దాడులకు దిగాయి. దాంతో రాజధాని మీదుగా ఎటు చూసినా దట్టమైన పొగ అలముకుని కన్పించింది. అయితే దాడులకు ఇరానీలు వెరవలేదు. పేలుళ్ల అనంతరం కూడా వేలాదిగా టెహ్రాన్ వీధుల్లో ప్రదర్శనల్లో పాల్గొన్నారు. 'అమెరికాకు, ఇజ్రాయెల్‌కు మరణం' అంటూ పెద్దపెట్టున నినదించారు. ఇరాన్ న్యాయవ్యవస్థ చీఫ్ గులాం హుసేన్ మొహసెనీ ఎజెయ్, రక్షణ శాఖ ఉన్నతాధికారి అలీ లరిజానీ తదితరులు కూడా అందులో భాగస్వాములయ్యారు. పేలుళ్లలో చాలామందే మరణించినట్టు భావిస్తున్నారు. ఇరాన్ మాత్రం ప్రాణనష్టంపై ఎలాంటి ప్రకటనా చేయలేదు. పాలస్తీనావాసులకు మద్దతుగా ఇరాన్ ఏటా ఖుద్స్ డే జరుపుతూ వస్తోంది. ఇరాన్‌వ్యాప్తంగా క్షిపణి, ఇజ్రాయెల్-అమెరికా బాంబు దాడులు శుక్రవారమూ కొనసాగాయి. ప్రధానంగా సైనిక, క్షిపణి కమాండ్ వ్యవస్థలనే లక్ష్యం చేసుకున్నారు. ఇరాన్ కూడా భారీ స్థాయిలో ప్రతి దాడులకు దిగింది. మధ్యధరా ప్రాంతంలో మోహరించిన అమెరికాకు చెందిన భారీ విమానవాహక యుద్ధ నౌక అబ్రహం లింకన్‌పై ఏకంగా బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేసినట్టు రివల్యూషనరీ గార్డ్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. ''అత్యంత కచ్చితత్వంతో కూడిన మా దాడుల్లో నౌకకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రస్తుతం అది పని చేయడం లేదు. యుద్ధరంగం నుంచి వెనుదిరిగి వెళ్లిపోతోంది'' అని పేర్కొంది. అమెరికా మాత్రం ఈ వార్తలను ఖండించింది. ఒక ఇరాన్ పడవ కేవలం తమ నౌకకు అతి సమీపానికి వచ్చిందని యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది. అమెరికాకు చెందిన మరో విమానవాహక యుద్ధ నౌక గెరాల్డ్ ఫోర్డ్‌లోనూ మంటలు చెలరేగడం కలకలం రేపింది. దీనికి యుద్ధంతో సంబంధం లేదని అమెరికా తెలిపింది. ''లాండ్రీ ప్రదేశంలో చెలరేగిన మంటల్లో ఇద్దరు నావికులకు గాయాలయ్యాయి. నౌకకు నష్టమేమీ వాటిల్లలేదు. ఎప్పట్లాగే చురుగ్గా యుద్ధంలో పాల్గొంటోంది'' అని వెల్లడించింది. మరోవైపు లెబనాన్‌పై కూడా ఇజ్రాయెల్ దాడులు నిర్నిరోధంగా కొనసాగాయి. దాంతో 60 మందికి పైగా గాయపడ్డారు.



### గల్ఫ్ పై దాడులే దాడులు

అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా గల్ఫ్ దేశాలపైనా ఇరాన్ తీవ్రస్థాయిలో దాడులు కొనసాగించింది. దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంపై శుక్రవారం మరోసారి డ్రోన్ దాడులు జరిపింది. దాంతో అక్కడ మంటలు చెలరేగాయి. నలుగురు గాయపడ్డట్టు సమాచారం. దుబాయ్ పారిశ్రామిక ప్రాంతంపైనా దాడులు జరిగాయి. దాంతో దుబాయ్ ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సెంటర్‌లో ఒక భవనం భారీగా దెబ్బ తిన్నది. అబుదాబి విమానాశ్రయ సమీపంలో కూడా డ్రోన్ దాడులతో మంటలు చెలరేగాయి. తమపైకి దూసుకొచ్చిన 7 ఇరాన్ బాలిస్టిక్ మిసైళ్లను, 27 డ్రోన్లను అడ్డుకున్నట్టు యూఏఈ ప్రకటించింది. ఒమన్‌లోని సొహార్ నగరంపై రెండు డ్రోన్ దాడులు జరిగాయి. వాటిలో ఒకటి అల్ అవీ పారిశ్రామిక ప్రాంతాన్ని తాకడంతో అక్కడ పని చేస్తున్న ఇద్దరు ప్రవాస భారతీయులు దుర్మరణం పాలయ్యారు. మరో 11 మంది గాయపడ్డారు. వారిలో 10 మంది భారతీయులేనని తెలుస్తోంది. దీంతో పశ్చిమాసియాలో ఇప్పటిదాకా మరణించిన భారతీయుల సంఖ్య 5కు చేరింది.

### ముజ్తాబాకు తీవ్ర గాయాలు: హెగ్సెత్

ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ తీవ్రంగా గాయపడ్డట్టు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ తెలిపారు. గాయాలతో మొజ్తబా గుర్తుపట్టలేని విధంగా మారిపోయారని ఆయన చెప్పారు. ఇరాన్‌లో ఇప్పటిదాకా 15 వేలకు పైగా లక్ష్యాలపై దాడులు చేసినట్టు తెలిపారు.

### మా టార్గెట్ ముజ్తబా: నెతన్యాహు

ఇరాన్‌పై దాడులు ఊహించిన దాని కంటే గొప్పగా సాగుతున్నాయని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు చెప్పారు. కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ జీవితానికి గ్యారంటీ లేదన్నారు. ఆయనతో పాటు హెజ్బొల్లా నేత నయీం ఖాసీంను కూడా లక్ష్యం చేసుకున్నట్టు వెల్లడించారు.

### ఇరాన్ లొంగుబాట: ట్రంప్

"ఇరాన్ ఇప్పటికే లొంగుబాట పట్టింది. మనందరినీ వేధిస్తున్న క్యాన్సర్‌ను నిర్మూలించాను" అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. జీ7 దేశాధినేతలతో జరిపిన వర్చువల్ మీటింగ్‌లో ఆయన ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై తాము చేపట్టిన ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ విజయవంతమైందని ప్రకటించుకున్నారు. యుద్ధానికి త్వరగా ముగింపు పలకాలని దేశాధినేతలు ట్రంప్‌కు సూచించారు. అంతకుముందు ట్రూత్‌సోషల్ పోస్టుల్లో ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరికలు చేశారు. "ఈ మతిలేని మూర్ఖులకు ఏం జరగనుందో చూస్తూండండి! వారి నేవీ, ఎయిర్‌ఫోర్స్, క్షిపణులు, డ్రోన్లు అన్నీ మట్టికరిచాయి. సర్వమూ నాశనమవుతోంది. నాయకులు తుడిచిపెట్టుకుపోయారు. 47 ఏళ్లుగా ఇరాన్ ప్రపంచమంతటా అమాయకులను చంపుతూ వస్తోంది. 47వ అమెరికా అధ్యక్షునిగా నేను వాళ్లను చంపుతున్నా. ఎంతో గొప్ప విషయమిది!" అని చెప్పుకున్నారు. ఇరాన్ వద్ద పోగుపడ్డ యురేనియం నిల్వల స్వాధీనంపై ప్రస్తుతానికి దృష్టి పెట్టడం లేదని ట్రంప్ చెప్పారు. అయితే ముున్ముందు పరిస్థితి మారే ఆస్కారం లేకపోలేదన్నారు. యుద్ధంలో ఇరాన్‌కు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సాయం చేస్తున్నారని కూడా ట్రంప్ అనుమానాలు వెలిబుచ్చారు.

# మొజ్తాబా ఖమేనీని ఖతం చేస్తాం.. నెతన్యాహూ సంచలన వ్యాఖ్యలు

ఫిబ్రవరి 28న అమెరికాతో కలిసి ఇరాన్‌పై యుద్ధాన్ని మొదలు పెట్టిన తరువాత ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు స్పందించారు. తమ దేశం "ఎప్పటికన్నా బలంగా మారుతోంది" అని గురువారం ఒక వార్తా సమావేశంలో నెతన్యాహు పేర్కొన్నారు. అలాగే తాము ఇరాన్, దాని ప్రాక్సీలపై బలవంతంగా దాడి చేస్తున్నామంటూ ఆయన ఎక్స్‌లో ఒక పోస్ట్ పెట్టారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత తొలిసారి విలేకరుల సమావేశం నిర్వహించిన నెతన్యాహు ఇరాన్ కొత్త సుప్రీం నాయకుడు మొజ్తాబా ఖమేనీని చంపేస్తామని ఒక రహస్య



బెదిరింపు జారీ చేశారు. కొత్త ప్రభుత్వం కుప్ప కూలుతుందని అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము చోద్యం చూడటం లేదనీ, పూర్తి బలంతో దాడి చేస్తున్నామన్నారు. "ధైర్యవంతులు గెలుస్తారు" అనే సూత్రంతో, మధ్యప్రాచ్య ముఖచిత్రాన్ని మార్చేస్తామని, శత్రువులను వెంటాడి మరీ దాడి చేస్తామని పేర్కొన్నారు. ఇరాన్ తన అణు, బాలిస్టిక్ ప్రాజెక్టులను భూగర్భంలోకి తరలించకుండా తమ దళాలు నిరోధించాయనీ, ఇరాన్ ఇకపై అదే ఇరాన్ కాదు, పేర్కొన్నారు. అంతేకాదు తాము ఇరానియన్ అణు శాస్త్రవేత్తలను చంపాయని, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (IRGC), బాసిజ్ దళాలకు తీవ్ర నష్టం కలిగించాయని నెతన్యాహు అన్నారు.

# భారీ పేలుళ్లు : బుర్జ్ ఖలీఫా చుట్టూ దట్టమైన పొగ

ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్‌దాడులు, ఇరాన్ ప్రతి దాడులోగల్ఫ్ ప్రాంతం గజగజ లాడుతోంది. ఈ రోజు (శుక్రవారం)దుబాయ్‌లోని కొన్నిప్రాంతాల్లో పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ముఖ్యంగా ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన భవనం దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫా దగ్గర దట్టమైన పొగ వ్యాపించిన వీడియోలు వైరల్‌గా మారాయి. ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్న వీడియోలలో ఐకానిక్ బుర్జ్ ఖలీఫా భవనాల పైన నుండి భారీ పొగ ఎగసిపడుతున్నట్లు కనిపించింది. ఆకాశహర్మ్యాల మీదుగా పొగ మేఘాలు అలుముకున్నాయి. ఈ ఘటన నగరంలోని కేంద్ర వ్యాపార మండలాల్లో ఆందోళనను పెంచింది. పేలుళ్ల కారణంగా చుట్టుపక్కల భవనాల్లో గణనీయమైన ప్రకంపనలు వచ్చాయని సంఘటనా స్థలానికి సమీపంలో ఉన్న మీడియా ప్రతినిధులు వెల్లడించారు. ఏజెన్సీ ఫ్రాన్స్‌ప్రెస్ ప్రతినిధి ప్రకారం, మొదటి పేలుడు సమీపంలోని నిర్మాణాలను కదిలించేంత బలంగా ఉంది. ఆ తర్వాత కొద్దిసేపటికే రెండో పెద్ద పేలుడు సంభవించింది. ఆ ప్రాంతంలోని నివాసితులు, కార్మికులలో ఆందోళన రేపింది.అయితే ఇది స్వల్ప నష్టం మాత్రమేనని అధికారులు ప్రకటించారు.



# ఆశను కోల్పోవద్దు

సౌత్ ఇండియా ప్రముఖ నటి హన్సిక మోత్వాని విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. 2022లో సోహైల్‌ను పెళ్లి చేసుకున్న ఆమె సుమారు నాలుగేళ్ల తర్వాత విడిపోయారు. అయితే, విడాకుల తర్వాత తొలిసారి సోషల్‌మీడియాలో ఆమె ఒక పోస్ట్ చేసింది. 'చర్ది కలా' ఆల్వేస్ అని పంజాబీ భాషలో కొటేషన్ షేర్ చేసింది. జీవితంలో ఎలాంటి కష్టాలు వచ్చినప్పటికటీ ధైర్యంగా ముందుకు సాగాలని అర్థం వచ్చేలా తెలిపింది. ఎలాంటి పరిస్థితిలు వచ్చినా సరే ఆశను కోల్పోవద్దని పేర్కొంది.

ప్రముఖ వ్యాపారవేత్త సోహైల్ కతూరియాను రాజస్థాన్‌లో హన్సిక పెళ్లి చేసుకుంది. ఈ పెళ్లి వేడుక ఎంతో గ్రాండ్‌గా జరిగింది. సోషల్‌మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అయింది. అయితే, వివాహం అయిన ఆరు నెలల నుంచే వారిద్దరి మధ్య వబేదాలు వచ్చాయని వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో గతేడాది ఆమె వారి పెళ్లి ఫోటోలను ఇన్‌స్టా నుంచి తొలగించడంతో విడాకుల నిజమేనని నమ్మాల్సిన పరిస్థితి వచ్చింది. ఫైనల్‌గా ఈ ఏడాది మార్చి 11న వారికి విడాకులు కోర్డు మంజూరు చేసింది.





# పేరుకే సీరియల్ నటి.. కానీ హీరోయిన్స్ కు మించిన క్రేజ్

ఈమధ్యకాలంలో సీరియల్ నటీనటులకు సైతం హీరోహీరోయిన్స్ రేంజ్ ఫాలోయింగ్ ఉంటుంది. బుల్లితెరపై పలు సీరియల్స్ ద్వారా తమకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న తారలు చాలా మంది ఉన్నారు. అందం, అభినయంతో టీవీ ఇండస్ట్రీలో స్టార్ డమ్ సంపాదించుకున్నారు. అయితే ఇప్పుడు మనం మాట్లాడుకోబోయే ఓ హీరోయిన్ కు మాత్రం విపరీతమైన క్రేజ్ ఉంది. ఈమధ్యకాలంలో సీరియల్ నటీనటులకు సైతం హీరోహీరోయిన్స్ రేంజ్ ఫాలోయింగ్ ఉంటుంది. బుల్లితెరపై పలు సీరియల్స్ ద్వారా తమకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న తారలు చాలా మంది ఉన్నారు. అందం, అభినయంతో టీవీ ఇండస్ట్రీలో స్టార్ డమ్ సంపాదించుకున్నారు. అయితే ఇప్పుడు మనం మాట్లాడుకోబోయే ఓ హీరోయిన్ కు మాత్రం విపరీతమైన క్రేజ్ ఉంది. ఈ అమ్మడి అందానికి కుర్రకారు ఫిదా అవుతున్నారు. ఆమె గతంలో స్మాల్ స్క్రీన్ పై నటించి.. ఆ తర్వాత బిగ్ బాస్ రియాల్టీ షోలో పాల్గొని పాపులర్ అయ్యింది. ఈ షో ద్వారా విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకున్న ఈ అమ్మడు.. ప్రస్తుతం తమిళం సీరియల్స్ చేస్తుంది. ఆమె మరెవరో కాదండి.. టీవీ నటి ఆయేషా.. కొన్నాళ్లపాటు సీరియల్స్ చేసిన ఈ ముద్దుగుమ్మ.. ఇప్పడు సినిమాల్లో నటిస్తుంది. ప్రస్తుతం తమిళ్ హీరో విజయ్ ఆంటోని ప్రధాన పాత్రలో నటించి మెప్పించింది. అలాగే మొన్నామధ్య జీ తమిళంలో వచ్చే సూపర్ క్వీన్ షోలో పాల్గొంది. ఇదివరకు తెలుగులో వచ్చిన సావిత్రమ్మ గారి కొడుకు సీరియల్లో ప్రధాన పాత్రల పోషించింది. ఆ తర్వాత తెలుగుతోపాటు తమిళంలోనూ పలు సీరియల్స్ చేసింది. ఇటు సోషల్ మీడియాలోనూ చాలా యాక్టివ్ గా ఉంటుంది. రీసెంట్ గా బిగ్ బాస్ సీజన్ 9లో తళుక్కున మెరిసింది. బిగ్ బాస్ సీజన్ 9లో వైల్డ్ కార్డు ద్వారా ఎంట్రీ ఇచ్చిన అయేషా. అనారోగ్య సమస్యలతో కొద్దిరోజులకే షో నుంచి వెళ్ళిపోయింది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ చిన్నది తన ఫొటోలతో అభిమానులను కవ్విస్తుంది.

# సంచలన నిర్ణయం తీసుకోనున్న త్రిష

నటి త్రిష పేరు వార్తల్లో మారుమోగుతోంది. ఏ న్యూస్ పేపర్ చూసిన, ఏ సామాజిక మాధ్యమాలు చూసిన త్రిష గురించే పోస్టులు కనిపిస్తున్నాయి. చివరికి రాజకీయ వర్గాల్లోనూ త్రిష సెంటర్ పాయింట్‌గా మారారు. ఆ మధ్య నటుడు విజయ్, త్రిష గురించి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. దీంతో ఆయన త్రిషకు క్షమాపణ కూడా చెప్పారు. ఆ తర్వాత అనూహ్యంగా నటుడు విజయ్ భార్య సంగీత విడాకుల కోసం కోర్టుకు ఎక్కడం తీవ్ర సంచలనానికి గురిచేసింది. అందులో తన భర్త ఒక నటితో సంబంధం పెట్టుకోవడమే తను విడాకులు కోరడానికి కారణం అని కూడా సంగీత పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ విజయ్, త్రిష కలిసి చెన్నైలో జరిగిన ఒక వివాహ వేడుకలో పాల్గొనడం పెద్ద చర్చకు దారి తీసింది.

అలాంటి పరిస్థితుల్లో మరో సీనియర్ నటుడు పార్థిబన్ కూడా నటి త్రిష గురించి అనుచిత వ్యాఖ్యలు చేసి వార్తల్లోకి ఎక్కారు. ఆయన వ్యాఖ్యలను నటి త్రిష తీవ్రంగా ఖండించింది. దీంతో పార్థిబన్ కూడా ఆమెకు క్షమాపణలు చెప్పడం ఆపై పొరపాటు అని మరో స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఇలా ఈ చర్చ జరుగుతున్న తరుణంలో నటి త్రిష గురించి మరో ఆసక్తికరమైన వార్త సామాజిక మాధ్యమంలో వైరల్ అవుతోంది. నిజం చెప్పాలంటే ఆమె ఇటీవల నటించిన విడాముయర్చి, థక్ లైఫ్ చిత్రాలు పూర్తిగా నిరాశ పరచడంతో పాటు త్రిష నటనను ఆమె ఎంచుకున్న పాత్రల గురించి తీవ్రంగా విమర్శలు వెల్లువెత్తాయి. అదే సమయంలో ఈమె కొత్తగా చిత్రాలను అంగీకరించలేదు.

## రాజకీయాల వైపు త్రిష

తెలుగులో చిరంజీవితో జంటగా నటించిన విశ్వంభర చిత్రం చాలా కాలంగా నిర్మాణంలో ఉంది. మలయాళంలోనూ ఇదే పరిస్థితి. ఇక తమిళంలో సూర్యకు జంటగా నటించిన కరుప్ప చిత్రం నిర్మాణ కార్యక్రమం పూర్తిచేసుకుని త్వరలో తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. దీంతో త్రిష కొత్తగా చిత్రాలను ఒప్పుకోవడం లేదని దానికి కారణం నటనకు స్వస్తి పలికి ఆమె రాజకీయ రంగ ప్రవేశం చేయడానికి సిద్ధమవుతున్నారని ప్రచారం సామాజిక మాధ్యమంలో వైరల్ అవుతుంది.

ఇందులో నిజం ఎంతో తెలియదు గానీ, ఆమధ్య తనకు రాజకీయాలపై ఆసక్తి లేదని, అసలు రాజకీయాలు తనకు తెలియదని నటి త్రిష పేర్కొన్నారు. అయితే, అది అప్పటి పరిస్థితిని బట్టి ఆమె అలాంటి స్టేట్‌మెంట్ ఇచ్చారని కొందరు అంటున్నారు. ఇప్పటి పరిస్థితి చూస్తుంటే త్రిష రాజకీయ రంగ ప్రవేశంపై ఆసక్తి చూపుతున్నట్లు ఒక వర్గం పేర్కొంటుంది. ఇప్పటికే ప్రముఖ స్టార్‌గా వెలుగొందిన నటుడు విజయ్ నటనకు స్వస్తి చెప్పి రాజకీయ రంగ ప్రవేశం చేసిన విషయం తెలిసిందే. విజయ్ ప్రారంభించిన తమిళగ వెట్రి కళగం పార్టీలోనే త్రిష చేరే అవకాశం ఉందనే ప్రచారం కూడా జోరుగా సాగుతోంది.






# ఖుషి రోజులను గుర్తు చేసేలా ఉంటుంది

## నిర్మాత రవిశంకర్ యలమంచిలి

"'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమా చాలా బాగా వచ్చింది. 'గబ్బర్ సింగ్' మూవీ స్థాయికి తగ్గకూడదనే లక్ష్యం తో హరీష్ శంకర్ ఈ సినిమాని తెరకెక్కించారు. 'ఖుషి' నాటి రోజులను గుర్తు చేసేలా ఈ చిత్రం ఉంటుందని హామీ ఇవ్వగలను. అన్ని వాణిజ్య అంశాలతో రూపొందిన ఈ సినిమా ఆద్యంతం ఎంజాయ్ చేసేలా ఉంటుంది" అని నిర్మాత రవి శంకర్ యలమంచిలి పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ హీరోగా నటించిన చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీష్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచి లి నిర్మించిన ఈ చిత్రం 19న విడుదల కానుంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'కాలరే ఎత్తరా..' అంటూ సాగే మూడో పాటని విడుదల చేశారు మేకర్స్. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటని రామ్ మిర్యాల పాడారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హరీష్ శంకర్ మాట్లాడుతూ–"1500 నుంచి 2000 మందితో ఈ పాటను తెరకెక్కించాం. మైత్రి మూవీ మేకర్స్‌లాంటి నిర్మాతలు దొరకడం నా పూర్వజన్మ సుకృతం" అని తెలిపారు. "నేను కూడా ఈ పాటను ఎంతో ఎంజాయ్ చేశాను" అన్నారు రాశీ ఖన్నా. పాటల రచయిత కాసర్ల శ్యామ్ మాట్లాడారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com